ప్రజాశక్తి

గురువారం 11 ఏప్రిల్ 2024 8 పేజీలు

కర్నూలు నంద్యాల





కొండెక్కిన 'కోడి'

- కిలో రూ.300కు చేరిన చికెన్ ధర - సామాన్యులకు భారీ భారం



ప్రజాశక్తి-కర్నూలు ప్రతినిధి

కోడి మాంసం ధర కిండెక్కి కూర్చుంది. కిలో చికెన్ ధర రూ.300 చేరింది. దీంతో చికెన్ కొనడం సామాన్యులకు భారీ భారంగా మారింది. ఎండల తీవ్రత వల్ల కోళ్లు చనిపోవడం, డిమాండ్‌కు తగ్గ సరఫరా లేకపోవడంతోనే చికెన్ ధరలు భారీగా పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు...

చికెన్ ప్రియులకు ధరల షాక్ తగులుతోంది. మార్కెట్లో చికెన్ కొనాలంటే ముందు పర్సును ఒకటికి రెండుసార్లు తడుముకోవాల్సి వస్తోంది. రికార్డు స్థాయికి చికెన్ ధర చేరుకుంది. తాజాగా బుధవారం మార్కెట్లో కిలో చికెన్ ధర ఏకంగా రూ.300కి చేరింది. గత నెల 10వ తేదీన కిలో చికెన్ ధర రూ.240 ఉంది. గత నెలలో కోడి (లైవ్) కేజీ ధర రూ.120 కాగా, ప్రస్తుతం అది రూ.166కు చేరింది. కర్నూలు నగరంలో స్కిన్‌తో చికెన్ ధర కిలో రూ.280 ఉండగా కాల్చిన కోడి ధర కిలో రూ.290, స్కిన్ లెస్ చికెన్ కిలో రూ.300 పలుకుతోంది. గత కొన్ని రోజులుగా రోజురోజుకూ ధరలు ఆకాశాన్ని అంటుతుండడంతో సామాన్యులకు చికెన్ అందుబాటులో లేకుండా పోయింది. ఉష్ణోగ్రతలు 35 డిగ్రీల సెల్సియస్ దాటితే కోళ్లు తట్టుకోలేవు. మార్చి ఒకటి నుంచి ఉష్ణోగ్రతలు గణనీయంగా పెరిగాయి. సరాసరిన 44 నుంచి 46 డిగ్రీల సెల్సియస్ నమోదవుతుండడంతో వేడికి తట్టుకోలేక అవి చనిపోతున్నాయి. మరోవైపు దంబోరా వ్యాధి కోళ్ల పరిశ్రమలను వెంటాడుతోంది. మార్కెట్లో లేయర్ కోళ్ల కన్నా బ్రాయిలర్ కోళ్లకే డిమాండ్ ఎక్కువ. లేయర్ కోళ్లు కొంతవరకూ ఎండను తట్టుకుంటున్నా బ్రాయిలర్ కోళ్లు మాత్రం ఎక్కువగా చనిపోతున్నాయి. దీంతో, డిమాండుకు తగ్గ ఉత్పత్తి లేక వ్యాపారులు ధర పెంచేశారు. రైతులు నష్టాలను పూడ్చుకునేందుకు తక్కువ బరువు ఉండగానే వచ్చినకాడికి కోళ్లను అమ్ముకుంటున్నారు. కొంతమంది రైతులు వేసవి దష్ట్యా ఉత్పత్తిని ఆపేశారు. మరోవైపు కార్పొరేట్ సంస్థల నుంచి పోటీని స్థానిక పౌల్ట్రీ రైతులు తట్టుకోకపోతున్నారు. కార్పొరేట్ కంపెనీల నుంచి దిగుమతి అవుతున్న కోళ్లతో పోల్చితే లోకల్ కోళ్లు తక్కువ బరువు ఉంటున్నాయి. దీంతో, దళారులు అడిగిన ధరకు రైతులు విక్రయించక తప్పడం లేదు. దీంతో చికెన్ ధరలు అమాంతం పెరిగిపోయాయి. ఎండ వేడిమికి కోళ్లు చనిపోవడం,

మిగతా 3లో

24న ఎన్నికల పరిశీలకుల పర్యటన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

ఈనెల 24న ఎన్నికల పరిశీలకులు రానున్నారని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. .బుధవారం కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో సాధారణ ఎన్నికల నిర్వహణపై లెయిజన్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ పార్లమెంటుకు ఒక ఎన్నికల పరిశీలకుడు, కర్నూలు, కోడుమూరు, మంత్రాలయం, ఎమ్మిగనూరు నియోజకవర్గాలకు ఒకరు, ఆలూరు, ఆదోని, పత్తికొండ నియోజకవర్గాలకు ఒకరు నంద్యాల, శ్రీశైలం, పాణ్యం, డోన్ నియోజకవర్గాలకు ఒకరు, ఉమ్మడి జిల్లాలకు కలిపి ఒక పోలీసు పరిశీలకులు రానున్నారనే విషయం గురించి స్పష్టత వచ్చిందని కలెక్టర్ తెలిపారు. నంద్యాల, శ్రీశైలం, పాణ్యం, డోన్ నియోజకవర్గాలకు సంబంధించిన ఎన్నికల పరిశీలకుడు నంద్యాల జిల్లాలోనే ఉంటారని, కర్నూలు జిల్లాలో మొత్తం నలుగురు ఎన్నికల పరిశీలకులు ఉంటారన్నారు. నియోజకవర్గాల లోని అన్ని పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తారని మరీ ముఖ్యంగా క్రిటికల్, వల్నరబుల్ పోలింగ్ కేంద్రాలను తనిఖీ చేస్తారన్నారు. వాటితో పాటు మౌలిక సదుపాయాలను కూడా తనిఖీ చేస్తారని, అందుకు గాను సంబంధిత లైజన్ ఆఫీసర్లు నియోజకవర్గాల వారిగా క్రిటికల్, వల్నరబుల్ పోలింగ్ కేంద్రాల గురించి, సంబంధిత పోలింగ్ కేంద్రాలు ఏ మండలం కిందికి వస్తాయనే వివరాలతో ఉండాలన్నారు. ప్రభుత్వ అతిథి గృహాలలోనే మీటింగ్ హాల్ ఏర్పాటు చేసి, కంప్యూటర్, ఇంటర్నెట్, ప్రింటర్ లాంటి సదుపాయాలతో

మిగతా 3లో

నేడు రంజాన్

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

రంజాన్ పండుగను ఈద్-ఉల్-ఫితర్ అని కూడా అంటారు. రంజాన్ మాసం మొదలు మార్చి 12 ప్రారంభం నుండి ఏప్రిల్ 11 వరకు నెల రోజులు ముస్లింలు కఠోర ఉపవాస దీక్షలు నిర్వహించి రాత్రులందు ఖురాన్ పఠనం తర్వాత చంద్రోదయం చూసిన మరుసటి రోజు ఉదయం నుండే ఈద్-ఉల్-ఫితర్ నమాజును మసీదులలో ఈద్గాలలో మత పెద్దలు (పేషీమాం)

మిగతా 3లో



మైనార్టీ సంక్షేమ అధికారి కార్యాలయం ప్రారంభం



కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

కర్నూలు కలెక్టరేట్ కాంప్లెక్స్‌లో ఆధునికరించిన జిల్లా మైనార్టీల సంక్షేమ శాఖ కార్యాలయాన్ని బుధవారం జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సృజన ప్రారంభించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ధునీకరించి జిల్లా మైనార్టీల సంక్షేమ శాఖ కార్యాలయాన్ని ప్రారంభించుకున్నామని తెలిపారు. పాస్టర్లు, మౌలానాలు ప్రార్ధనలు జరిపారు. ఈ కార్యక్రమంలో డిఆర్‌ఒ కె.మధుసూదన్ రావు, జిల్లా మైనార్టీ వెల్ఫేర్ అధికారి సునీల్, ఆంధ్రప్రదేశ్ మైనారిటీస్ ఫైనాన్స్ కార్పొరేషన్ ఇడి సబిహ ఫర్విన్, మైనార్టీ వెల్ఫేర్ కార్యాలయం సూపరిన్‌టెన్‌డెంట్ శ్యాం బాబు, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

శ్రీశైలంలో ముగిసిన ఉగాది మహోత్సవాలు

- చివరి రోజు అశ్వ వాహనసేవ, నిజాలంకరణ, పూర్ణాహుతి



స్వామి అమ్మవార్లకు అశ్వ వాహనసేవ, నిజాలంకరణలో అమ్మవారు

వార్త 3లో

బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలి

పాణ్యం రిటర్నింగ్ అధికారి నారపురెడ్డి మౌర్య

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పోలింగ్ విధులపై పోలింగ్ సిబ్బంది ఎన్నికల కమిషన్ ఇచ్చిన మార్గనిర్దేశకాలను పాటిస్తూ బాధ్యతాయుతంగా విధులు నిర్వహించాలని పాణ్యం రిటర్నింగ్ అధికారి , జాయింట్ కలెక్టర్ నారపురెడ్డి మౌర్య. సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం నగరంలోని ఓ ప్రైవేటు కళ్యాణ మండపంలో బూత్ లెవెల్ స్థాయి అధికారులకు, పిఒలకు, ఎపిఒలకు నియోజకవర్గ స్థాయిలో జాయింట్ కలెక్టర్ సమావేశం నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ సాధారణ ఎన్నికలపై పోలింగ్ విధులు నిర్వహించే సిబ్బందికి అవగాహన కల్పించేందుకు గాను సమావేశం ఏర్పాటు చేశారు. పోలింగ్ విధులపై పోలింగ్ సిబ్బంది ఎన్నికల కమిషన్ ఇచ్చిన మార్గనిర్దేశకాలను పాటిస్తూ వారికి ఇచ్చిన బాధ్యతలను నిర్వహించాలన్నారు. ఎన్నికల సిబ్బందిని ఆదేశించారు. పోలింగ్ రోజున బిఎల్ఒలు, సెక్టార్ ఆఫీసర్లు ఇవిఎంలను ఏ విధంగా కనెక్ట్ చేయాలి, ఏ విధంగా తొలగించాలి, మాక్ పోల్ నిర్వహణ, మాక్ పోల్ స్లిప్స్ నిర్వహణ, మాక్ పోల్ క్లియర్ చేయడం, పోలింగ్ యంత్రాలపై పూర్తి స్థాయి అవగాహన పెంచుకోవాలన్నారు. పోలింగ్ పూర్తి అయిన వెంటనే కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివిప్యాట్ మిషన్లు, వివి



ప్యాట్ స్లిప్స్, పిఓ డైరీ 17(సి), పిఓ రిపోర్ట్ తో స్ట్రాంగ్ రూమ్ లో చేర్చేలా పోలింగ్ సిబ్బంది చర్యలు తీసుకోవాలన్నారు. సమావేశంలో గడివేముల,పాణ్యం, ఓర్వకల్లు, కల్లూరు, మండలాల తహశీల్దార్లు, పిఒలు, ఎపిఒలు,సెక్టార్ ఆఫీసర్లు, బిఎల్ఒలు తదితరులు పాల్గొన్నారు.



పారువేటలో పాల్గొన్న యువకులు

ఘనంగా ఉగాది పారవేట వేడుకలు

ప్రజాశక్తి- తుగ్గలి

మండల కేంద్రమైన తుగ్గలి, రాతన, జొన్నగిరి, శభాష్ పురం, ఎద్దులదొడ్డి, పెండెకల్లు తదితర గ్రామాలతో పాటు వివిధ గ్రామాలలో బుధవారం ఉగాది పారువేట కార్యక్రమాలు ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా మండల కేంద్రమైన తుగ్గలి చెరువులో కుందేళ్లతో గ్రామస్తులు పరవేట కార్యక్రమం నిర్వహించారు. అదే విధంగా రంగుల కోలాటంతో యువత ఆనందో ఉత్సవాల మధ్య జరుపుకున్నారు. గ్రామాలలో ఇలాంటి అవంచనియ సంఘటనలు జరుగుకుండ పోలీస్ బందాబస్తూ నిర్వహించారు.



ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్

ప్రజాశక్తి-కర్నూలు క్రైమ్: జగన్నాథ గట్టుపై ఏర్పాటు చేసిన ఇఫ్తార్ విందులో ఎమ్మెల్యే హాఫీజ్ ఖాన్ , వైసిపి అభ్యర్థి ఇంతియాజ్, మొయిద్ ఖాన్, మాజీ ఎమ్మెల్యే పాల్గొని మత పెద్దలతో కలిసి దువా చేశారు. కార్యక్రమంలో వైసిపి ముఖ్య నాయకులు కార్పొరేటర్లు, నాయకులు పాల్గొన్నారు.ఎన్నికలపై శిక్షణ

ప్రజాశక్తి–పత్తికొండ:ఓటర్లకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తిస్థాయిలో సౌకర్యాలు కల్పిస్తామని పత్తికొండ ఆర్‌డిఒ రామలక్ష్మి పేర్కొన్నారు.గురువారం పత్తికొండలో గోపాల్ ప్లాజా ఫంక్షన్ హాల్ లో పిఒలు, ఎపిఒలకు ఎన్నికల శిక్షణ తరగతుల నిర్వహించారు. ఆర్‌డిఒ మాట్లాడుతూ గ్రామాలలో ఇంటింటికి తిరిగి ఓటర్లను పూర్తిస్థాయిలో వెరిఫికేషన్ చేయాలని అన్నారు. మరణించిన, వ్యక్తులను ఓటర్ లిస్టులో తొలగించాలని అన్నారు. ఈ సమావేశంలో పత్తికొండ తహశీల్దార్ మాధవరావు, మద్దికేర తుగ్గలి క్రిష్ణగిరి వెల్దుర్తి తహశీల్లార్లు పాల్గొన్నారు..



బిసివై ఎమ్మెల్యే అభ్యర్థికి సన్మానం

ప్రజాశక్తి-తుగ్గలి

పత్తికొండ నియోజకవర్గం భారత చైతన్య యువజన పార్టీ ఎమ్మెల్యే అభ్యర్థి మిద్దె వెంకటేశ్వర్లు కు తుగ్గలి మండలం ఎద్దుల దొడ్డి గ్రామానికి చెందిన యువకులు వెంకట్ రాముడు, చెన్నకేశవులు, తేజ ,సుధాకర్, నరసింహులు, రఫీ, సత్తార్ వలి, లక్ష్మణస్వామి తదితరులు బుధవారం మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆ యువకులు మాట్లాడుతూ తమ గ్రామంలో తాము ఏ పార్టీకి చెందిన వారం కాదని, అయితే ఈ ఎన్నికలలో తామంత బిసివై అభ్యర్థి మిద్దె వెంకటేశ్వర్లుకు అండగా నిలిచి గెలుపుకోసం కషి చేస్తామన్నారు. అనంతరం యువత మిద్దె వెంకటేశ్వర్లును ను సన్మానించారు.మిద్దె వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఎద్దులదొడ్డి నుండి యువకులు స్వచ్ఛందంగా వచ్చి తన విజయం కోసం కృషి చేస్తామని తెలపడం సంతోషదాయకమన్నారు. తమ పార్టీ ఎస్సీ, ఎస్టీ ,బీసీ మైనార్టీల అభివృద్ధికి కషి చేస్తుందన్నారు.

పోలింగు రోజు పిఒ, ఎపిఒలు కీలకం

ఇవిఎం కనెక్షన్లపై పై అవగాహన -కర్నూలు రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

3సాధారణ ఎన్నికల దృష్ట్యా పిఒ, ఎపిఒల పాత్ర కీలకమని, ఈ నేపథ్యంలో కొత్తగా వచ్చిన నియమాల పై అవగాహన మరింత పెంచుకోవాలని కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎ. భార్గవ్ తేజ పేర్కొన్నారు. బుధవారం కర్నూలు తనీష్ కన్వెన్షన్ హాలు లో సాధారణ ఎన్నికల–2024 నిర్వహణపై రిటర్నింగ్ అధికారి భార్గవ్ తేజ ఆధ్వర్యంలో పిఒలు, ఎపసిఒలకు శిక్షణ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పోలింగ్ మే 13న నిర్వహిస్తున్నామని, , సంబంధిత పోలింగ్ ప్రక్రియ కార్యక్రమంలో ముఖ్యంగా పిఓ, ఏపిఓ లకు ఇవిఎమ్ మెషీన్ కనెక్షన్ల నిర్వహణ, పలు అంశాల పై శిక్షణ అవసరమన్నారు. ఎన్నికల సంఘం ఆధ్వర్యంలో వచ్చిన హ్యాండ్ బుక్స్‌ను పూర్తిస్థాయిలో క్షుణ్ణంగా చదువుకోవాల్సిన అవసరం అవగాహన చేసుకోవాల్సిన అవసరం మన మీద ఉందన్నారు. డెమో ఇవిఎమ్ మెషిన్ సెట్ విత్ కంట్రోల్ యూనిట్, బ్యాలెట్ యూనిట్, వివిప్యాట్ మెషీన్ ఏర్పాటు చేశారు. వాటితో పాటు ఎన్నికల్లో ఉపయోగించే స్టేషనరీ 17సి ఫార్మేట్, ప్రిసైడింగ్ ఆఫీసర్ డైరీ, కొత్తగా ఇంట్రడ్యూస్ చేసిన ప్రిసైడింగ్ ఆఫీసర్ రిపోర్ట్, గ్రీన్ పేపర్ సీల్, పింక్ పేపర్ సీల్, అడ్రస్ ట్యాగ్స్, స్పెషల్ ట్యాగ్స్‌లపై డమ్మీ కాపీస్‌ను ఏర్పాటు చేశారు. ఎన్నికల విధుల్లో పాల్గొనే సిబ్బందికి రవాణా, భోజన సదుపాయంతో పాటు అవసరమైన ఫర్నీచర్ ను కూడా పూర్తి స్థాయిలో అందజేస్తామన్నారు. మే 12వ తేదీ సాయంత్రం నాటికి దాన్ని ఆర్గనైజ్ చేసుకోవాలన్నారు. ఓటరు ఎపిక్ కార్డు తీసుకురాని పక్షంలో పోస్టర్‌లో



ఇవిఎంపై అవగాహన కలిగిస్తున్న కర్నూలు రిటర్నింగ్ అధికారి భార్గవ్‌తేజ

మెన్షన్ చేసిన 8 ప్రభుత్వ గుర్తింపు కార్డుల ద్వారా ఓటర్‌కు ఓటు హక్కు కల్పించాలన్నారు. పోలింగ్ సమయం ముగుస్తున్న 15 నిమిషాల ముందు పోలింగ్ కేంద్రం బయటికి వెళ్లి ఎంతమంది ఉంటే అంతమందికి ఆఖరి వ్యక్తి వరకు ఓటు హక్కు వినియోగించుకునేలా స్లిప్స్ ఇవ్వాలన్నారు. ప్రతి గంటకు పోలింగ్ శాతాన్ని సెక్టార్ ఆఫీసర్ల ద్వారా జిల్లా ఎన్నికల అధికారికి తెలియజేయాలి అన్నారు.

జగన్ అరాచకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలి

ఎన్‌డిఎ కూటమి నాయకుల పిలుపు

ప్రజాశక్తి-కర్నూలు హాస్పిటల్ : రాష్ట్రంలో కొనసాగుతున్న జగన్ అరాచక పాలనను, మోసాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని ఎన్‌డిఎ కూటమి నాయకులు తీర్మానించారు. బుధవారం కర్నూలు జిల్లా టిడిపి కార్యాలయంలో బిటి. నాయుడు అధ్యక్షతన ఎన్‌డిఎ కూటమి పార్లమెంట్ సమన్వయ సమావేశం నిర్వహించారు. కర్నూలు పార్లమెంట్ పరిధిలోని పార్లమెంట్ అభ్యర్థి, 7 అసెంబ్లీ నియోజకవర్గాల నుండి పోటీచేస్తున్న అభ్యర్థులు, నియోజకవర్గాల ఇన్చార్జీలు హాజరయ్యారు. ప్రధానంగా రానున్న ఎన్నికల్లో తెలుగుదేశం, మిత్రపక్షాల అభ్యర్థుల గెలుపునకు మూడు పార్టీల నాయకులు కలిసి అనుసరించాల్సిన వ్యూహం గురించి చర్చించారు. తర్వాత పత్రికా, మీడియా ప్రతినిధుల సమావేశంలో బిటి. నాయుడు, బిజెపి నాయకులు విట్టారమేష్, నీలకంఠ, జనసేన సురేష్ బాబు మాట్లాడారు. రాష్ట్రంలో కొనసాగుతున్న రాక్షస జగన్ పాలననుండి ప్రజలకు విముక్తి కలిగించేందుకు రాష్ట్రాభివృద్ధి కోసం ప్రధాని మోడి, టిడిపి అధినేత చంద్రబాబునాయుడు, జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్ కలిసి సమిష్టి నిర్ణయం తీసుకున్నారని తెలిపారు. అందువల్ల రాష్ట్ర శ్రేయస్సును దృష్టిలో ఉంచుకొని అన్ని స్థాయి లెవల్ వరకు మూడు పార్టీల నాయకులు కార్యకర్తలు సమిష్టిగా పనిచేయాలన్నారు. సమావేశంలో టిడిపి ఆదోని ఇన్చార్జీ



మాట్లాడుతున్న టిడిపి అధ్యక్షులు బిటి.నాయుడు

కె. మీనాక్షీనాయుడు, పార్టీ అభ్యర్థులు బస్తిపాటి నాగరాజు, బి.వీరభద్రగౌడ్, ఎస్. రాఘవేంద్రారెడ్డి, బివి. జయనాగేశ్వరరెడ్డి, టిజి. భరత్, బొగ్గుల దస్తగిరి, సత్రం రామక్రిష్ణుడు, ముంతాజ్, జేమ్స్, కెయి జగదీష్, బిజెపి అభ్యర్థి డా పార్ధసారథి, నాయకులు నీలకంఠం, కపిలేశ్వరయ్య, సూర్యప్రకాష్, కోటేశ్వరరెడ్డి, ఎం.ప్రేమ్ కుమార్, టిడిపి నాయకులు మురహరిరెడ్డి, విష్ణువర్ధన్‌రెడ్డి, శ్రీరాములు వెంకట్రాముడు తదితరులు పాల్గొన్నారు.

పేద ముస్లిములకు నిత్యావసర సరుకులు పంపిణీ

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్ : రంజాన్ పండుగను పురస్కరించు కుని ఉపవాసం ఉండే పేద ముస్లిం మహిళలకు నిత్యావసర సరుకులను కర్నూలు నగరంలోని 48వ వార్డు రోజా వీధిలో ఎస్‌సి, ఎస్‌సి, బిసి, మైనార్టీ మహిళా ఐక్యవేదిక కర్నూలు నగర అధ్యక్షురాలు మీసాల సుమలత పంపిణీ చేశారు. ఆమె మాట్లాడుతూ రంజాన్ మాసంలో చివరి పది రోజులు మహమ్మద్ ప్రవక్త జీవితాంతం ఎథికాఫ్ పాటించేవారన్నారు. ఏకాగ్రతతో విధేయతతో దేవుని వేడుకునే అవకాశం ఎథికాఫ్‌లో దొరుకుతుందని ఆమె తెలిపారు. రంజాన్ మాసంలో మసీదులో ఏకాంత ఆరాధనలో లీనమవడం వల్ల మానసిక అలజడుల నుంచి రక్షణ పొందవచ్చని, దేవుని పట్ల విశ్వాసం పెరుగుతుందన్నారు. ఎథికాఫ్‌లో కురాన్ పారాయణం ధరూద్ చదువుతారన్నారు. రంజాన్ మాసంలో చివరి పది రోజులు మొహమ్మద్ ప్రవక్త జీవితాంతం ఎథికాఫ్ పాటించేవారని తెలిపారు. అస్మత్ బి, ఫరీదా, ముంతాజ్, మహబూబ్ బి, విశ్వకర్మ పాల్గొన్నారు.



నిత్యావసర సరుకులు పంపిణీ చేస్తున్న మీసాల సుమలత

శ్రీశైలంలో ముగిసిన ఉగాది మహోత్సవాలు

ప్రజాశక్తి - శ్రీశైలం

శ్రీశైలం క్షేత్రంలో జరుగుతున్న ఉగాది మహోత్సవాలు బుధవారం ముగిశాయి. చివరి రోజు పూర్ణాహుతి, అశ్వవాహన సేవ, నిజాలంకరణ కార్యక్రమాలను నిర్వహించారు. ఆలయ ప్రాంగణంలోని యాగశాలలో దేవస్థానం కార్యనిర్వహణాధికారి పెద్దిరాజు అర్చక వేద పండితులు పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. అలాగే స్వామి అమ్మవార్లకు విశేష పూజలు, అర్చనలు చేశారు. పూర్ణాహుతి కార్యక్రమంలో సంప్రదాయ ప్రకారం నారికేళాలు, పలు రకాల సుగంధ ద్రవ్యాలు, ముత్యం, పగడం, నూతన వస్త్రాలు మొదలైనవి హోమగుండంలోకి ఆహుతిగా సమర్పించారు. ఆ తర్వాత అవబృదం త్రిశూల స్నానం కార్యక్రమాలను నిర్వహించారు.

అశ్వ వాహన సేవ, నిజాలంకరణ : స్వామి అమ్మ వార్లకు వాహన సేవలో ఆలయ ప్రాంగణంలో అశ్వ వాహనంపై ఉత్సవమూర్తులను ఏర్పాటు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారికి అలంకరణలో భాగంగా నిజాలంకరణ అలంకారంలో అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు. అనంతరం అశ్వ వాహనంపై ఉన్న స్వామి అమ్మవార్లను ఆలయ ప్రాంగణంలో ప్రదక్షిణ కార్యక్రమాన్ని మంగళ వాయిద్యాలు, వేదమంత్రాల మధ్య నిర్వహించారు. అశ్వవాహన కార్యక్రమంతో ఉగాది మహోత్సవాలు ముగిశాయి.

ముస్లిములకు ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి ఇఫ్తార్ విందు

ప్రజాశక్తి-డోన్

రంజాన్ మాసం సందర్భంగా బుధవారం డోన్ పట్టణంలో ఎమ్మెస్సార్ కార్యాలయం నందు టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రంజాన్ మాసంలో ముస్లింలు ఎంతో పవిత్రంగా ఉంటారని, అటువంటి వారికి రంజాన్ ఇఫ్తార్ విందు ఏర్పాటు చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి డోన్ నియోజకవర్గ యువ నాయకులు గౌతమ్ కుమార్ రెడ్డి, భరత్ కుమార్ రెడ్డి, మాజీ ఎంపిపి ఆర్‌ఈ రాఘవేంద్ర, డోన్ పట్టణ అధ్యక్షులు చాటకొండ శ్రీనివాసులు, ఎస్సీ సెల్ అధికార ప్రతినిధి గంధం శ్రీనివాసులు, ముస్లిం సోదరులు పాల్గొన్నారు.



ముస్లింలకు ఇఫ్తార్ విందును వడిస్తున్న ధర్మవరం మన్నే సుబ్బారెడ్డి

టిడిపితోనే ముస్లిం మైనారిటీలకు న్యాయం : లాయర్ బాబు

ప్రజాశక్తి - పాణ్యం : రాష్ట్రంలో ముస్లిం మైనార్టీలకు తెలుగుదేశం పార్టీతోనే న్యాయం జరుగుతుందని టిడిపి లీగల్ సెల్ రాష్ట్ర కార్యదర్శి లాయర్ బాబు, నంద్యాల పార్లమెంట్ ఆర్గనైజర్ సెక్రెటరీ మైనార్టీ నాయకులు సుభాన్ అన్నారు. బుధవారం పాణ్యంలోని టిడిపి కార్యాలయంలో వారు విలేకరులతో మాట్లాడుతూ టిడిపి స్థాపించినప్పటి నుండి ముస్లిం మైనార్టీలకు పెద్దపీట వేశారన్నారు. ముస్లిం యువతులకు దులహన్ పెళ్లికానుక పథకం, రంజాన్ తోఫా, మసీదు ఇమామ్లకు మౌజన్ జీతాలు తెలుగుదేశం పార్టీ ప్రభుత్వంలో ఇచ్చారని తెలిపారు. త్వరలో జరిగే ఎన్నికల్లో టిడిపిని ఆదరించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో మాజీ కో ఆప్షన్ మెంబర్ జాకీర్, 5 వార్డు మెంబర్ మదర్సా ఫారుక్ చాంద్ భాషా, నూర్ బాషా రబ్బాని, నజీర్ హుస్సేన్, హుస్సేన్ వలి, జుబేర్ తదితరులు పాల్గొన్నారు.

వ్యకాస ఆధ్వర్యంలో రంజాన్ తోఫా పంపిణీ

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

పట్టణంలోని 13వ వార్డు హాజీ నగర్‌లో రంజాన్ మాసాన్ని పురస్కరించుకొని వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో దాదాపు 130 పేద ముస్లిం కుటుంబాలకు మండల అధ్యక్షుడు సంపంగి వెంకటేశ్వర్లు బుధవారం రంజాన్ తోఫాను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి సంవత్సరం వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పేద ముస్లింలను గుర్తించి రంజాన్ పండుగను కుటుంబ సభ్యులు జరుపుకోవాలని తోఫాను పంపిణీ చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ కార్మిక సంఘం పేద ప్రజల సమస్యల పరిష్కారం కోసం పని చేస్తుందన్నారు. ఇల్లు లేని నిరుపేదలకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలని, భూమిలేని పేదలకు భూములు పంచాలని పోరాటాలు చేస్తుందన్నారు. రంజాన్ తోఫాలో సరుకులు కెజి సేమియా, కేజీ గోధుమపిండి, ఒక లీటర్ ఆయిల్ ప్యాకెట్, కేజీ బ్యాల్లు, పంచదార, పలావ్ బియ్యం తదితర వస్తువులను అందించినట్లు తెలిపారు.



రంజాన్ తోఫా కిట్లను పంపిణీ చేస్తున్న వ్యకాసం నాయకులు

63 మంది వాలంటీర్లు రాజీనామా

- కమిషనర్‌కు రాజీనామా పత్రాల అందజేత

ప్రజాశక్తి నంద్యాల కలెక్టరేట్

నంద్యాల జిల్లా కేంద్రంలో వైఎస్ఆర్ నగర్, 38వ వార్డుకు చెందిన 34 మంది వాలంటీర్లు, 7వ వార్డు ఫరూక్ నగర్‌కు చెందిన 29 మంది మొత్తం 63 మంది వాలంటీర్లు బుధవారం రాజీనామా చేశారు. మున్సిపల్ కమిషనర్ పి.నిరంజన్ రెడ్డిని వారు కలిసి రాజీనామా పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా వాలంటీర్లు మాట్లాడుతూ జగన్ మోహన్ రెడ్డి అధికారంలో రాక ముందు వాలంటీర్లను తీసుకువస్తామని ఎలాంటి హామీ ఇవ్వకుండానే అధికారంలోకి వచ్చాక నిరుద్యోగులుగా ఉన్న తమకు వాలంటీర్ వ్యవస్థను తీసుకొచ్చారన్నారు. చంద్రబాబు నాయుడు నిరుద్యోగులను ఆదుకోలేదని, నిరుద్యోగ భృతి కూడా ఇవ్వలేదన్నారు. ఇప్పుడు అధికారంలోకి వస్తే రూ.10 వేలు ఇస్తామంటే నమ్మలేమని అన్నారు. జగన్ కోసం తాము దేనికైనా సిద్ధమని, జగన్‌ను, శిల్పాను గెలిపించుకోవడానికి ఇక నుండి ఎన్నికల ప్రచారంలో పాల్గొంటామని ప్రకటించారు. వాలంటీర్ల రాజీనామాల వెనుక వైసిపి నాయకుల హస్తం ఉన్నట్లు ప్రచారం సాగుతుంది.



రాజీనామా పత్రాలతో వాలంటీర్లు

భక్తులకు ఓఆర్ఎస్, మజ్జిగ, మాస్కులు పంపిణీ

ప్రజాశక్తి - మహానంది : ఉగాది పర్వదినం సందర్భంగా మహానందికి తరలివచ్చిన కన్నడ భక్తులకు రెడ్‌క్రాస్ జిల్లా కమిటీ ఆదేశాల మేరకు మహానంది మండల కమిటీ ఆధ్వర్యంలో ఓఆర్ఎస్ ద్రావణం, మజ్జిగ, మాస్కులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో రాంప్రసాద్, నాగరాజు, వెంకటేష్, మధు, రామచంద్రుడు, సుదర్శంచారి, బాలనరసయ్య, బాషా, హుసని, మున్నా తదితరులు సేవలందించారు.

ముగిసిన ఉగాది వేడుకలు

ప్రజాశక్తి - పాణ్యం : మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం కొత్తూరు సుబ్బారాయుడు స్వామి సన్నిధిలో ఉగాది వేడుకలు బుధవారం ఘనంగా ముగిశాయి. స్వామి వారికి అర్చన, పాలాభిషేకాలు నిర్వహించి ఉత్సవ మూర్తులను ఊరేగించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో రామకృష్ణ, ప్రధాన అర్చకులు నారాయణ స్వామి, సురేష్ శర్మ, కిట్టయ్య స్వామి, దేవాలయం సిబ్బంది సుబ్బారెడ్డి పాల్గొన్నారు.

24న ఎన్నికల పరిశీలకులు పర్యటన

మొదటి పేజీ తరువాయి... పాటు కంప్యూటర్ ఆపరేటర్ లు ఉండే విధంగా చూసుకోవాలని డిఆర్‌ఒను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా ఎస్‌పితో మాట్లాడి ఎన్నికల పరిశీలకులకు గన్‌మెన్లను ఏర్పాటు చేయించే విధంగా చర్యలు తీసుకుంటారని కలెక్టర్ తెలిపారు. సమీక్షలో డిఆర్ఒ మధుసూదన రావు, అబ్జర్వర్ల నోడల్ అధికారి విజయ, జిల్లా విద్యా శాఖ సహాయ సంచాలకులు శామ్యూల్, సెరికల్చర్ అధికారి, హార్టికల్చర్ అధికారి రామాంజనేయులు, డిప్యూటీ తహశీల్దార్ ఓంకార్, తదితరులు పాల్గొన్నారు.

కొండెక్కిన 'కోడి'

మొదటి పేజీ తరువాయి... డిమాండుకు సరిపడా ఉత్పత్తి లేకపోవడంతోనే చికెన్ ధరలు అమాంతం పెరిగినట్లు వ్యాపారులు చెబుతున్నారు.

సరైన ఉత్పత్తి లేకపోవడంతోనే.. : కృష్ణ, చికెన్ వ్యాపారి, కర్నూలు.

ఎండలు అమాంతం పెరిగిపోయాయి. ఎండ వేడిమికి కోళ్లు చనిపోతున్నాయి. ప్రజల డిమాండుకు సరిపడా ఉత్పత్తి లేకపోవడంతోనే చికెన్ ధరలు పెరిగిపోయాయి. చికెన్ ధరల పెరుగుదల ప్రభావం వ్యాపారం మీద కూడా పడింది. తక్కువ మొత్తంలో చికెన్ కొనుగోలు చేస్తున్నారు.

పర్సు ఖాళీ అవుతోంది.. : వీరేష్, ఆదోని.

ప్రస్తుతం చికెన్ కొనాలంటే పర్సు ఖాళీకాక తప్పడం లేదు. గతంలో ఇంట్లో ఉన్న నలుగురికి కిలో చికెన్ కొనుక్కుని తినేవాళ్లం. కిలో చికెన్ ధర రూ.300కు చేరడంతో ప్రస్తుతం అర కిలోతోనే సరిపెట్టుకోవాల్సి వస్తోంది.

నేడు రంజాన్

మొదటి పేజీ తరువాయి... ఆధ్వర్యంలో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహిస్తారు. ఈ ప్రార్థనలో దేశంలో ఉన్న ప్రాణులన్నీ సుఖసంతోషాలతో ఆయురా రోగ్యాలతో ఉండాలని ఇలాంటి ఇబ్బందులు కలగకుండా జీవితం సుఖంగా గడపాలని కోరుతూ ప్రార్థనలు చేస్తారు. నమాజ్ కు ముందుగా ఎవరి స్తోమతను బట్టి వారు ఫిత్ర దానం చేస్తారు. తోటి ముస్లిం పేద సోదరులకు వస్త్రదానం చేస్తారు. అందరూ ప్రార్థనల అనంతరం ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ ఈద్ ముబారక్ చెప్పుకుంటారు. ముస్లింలు హిందువులను సైతం తమ ఇంటికి భోజనాలకు ఆహ్వానించి ఆనందంగా ఈద్ ముబారక్ చెప్పుకుంటూ గడుపుతారు.

కర్నూలు నగరంలో నమాజ్ వేళలు..

కర్నూలు నగరంలో ఓల్డ్ ఈద్గా లో 8:30 గంటలకు, సంతోష్ నగర్ న్యూ ఈద్గా తొమ్మిది గంటలకు, హజరత్ లతీఫ్ లవ్ బాలి దర్గా మస్జిద్ నందు 6: 35 నిమిషాలకు, ఎంపీ రియల్ గార్డెన్ గం 6:45 నిమిషములకు, మస్జిదే ఏజీబీ దేహ గుల్సన్ ఏడు గంటలకు, గౌండ మసీదు 7 గంటల 15 నిమిషాలకు, పోలీస్ లైన్ మస్జిద్ ఎనిమిది గంటలకు, ఈ డ్రెస్ మసీదు ఎనిమిదిన్నర గంటలకు, మస్జిదే గఫూరియా 8:30 గంటలకు, మస్జిదే కాలే కరీం ఎనిమిదిన్నర గంటలకు, మెట్ కే మసీదు 9 గంటలకు, అది మసీదు హలే హదీస్ ఏడు గంటలకు, జోహరాపురం కిమ్స్ రోడ్డ ఆహాలే హదీస్ 6:45 నిమిషాలకు, పెల్లి మస్జిద్ 9 గంటలకు, దరాబి మస్జిద్ 9 గంటలకు, షామియా మస్జిద్ 9 గంటలకు, రోజా మజీద్ ప్రకాష్ నగర్ 9 గంటలకు, సలాం నగర్ మస్జిద్ అరోరా నగర్ 9 గంటలకు, మస్జిద్ కరీముల్లా షా ఖాద్రి గుంబద్ 9:30 గంటలకు, జామియా మసీదు 9:30 గంటలకు, మజీద్ ఏలాల్ 9:30 గంటలకు, మస్జిద్ ఏ ఇషాకియా రోజా దర్గా మసీదు 10 గంటలకు ఈద్ నమాజులు నిర్వహిస్తారని నిర్వాహకులు తెలిపారు. ఆయా ప్రాంతాల ముస్లిం సోదరులు సకాలంలో ప్రార్థనలో పాల్గొనాలని విజ్ఞప్తి చేశారు.


పంట కాలువకు ఏర్పడిన పెద్ద రంధ్రం

అవుకు రిజర్వాయర్ వద్ద
పంట కాలువకు గండి

- వృథాగా పోయిన నీరు

- తాత్కాలిక మరమ్మతులు చేపట్టిన అధికారులు

ప్రజాశక్తి - అవుకు

అవుకు రిజర్వాయర్ వద్ద పంట కాలువకు గండి ఏర్పడి నీరు వృథాగా పోయిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. రైతులు గమనించి పంట కాలువకు గండి పడిందని అధికారులకు సమాచారం ఇచ్చారు. సంబంధిత అధికారుల పర్యవేక్షణ లేకపోవడం కారణంగానే కాలువకు గండి పడిందని రైతులు వాపోయారు. పంట కాలువలకు, రిజర్వాయర్ కట్టలకు పెద్ద ఎత్తున కంపచెట్లు, ముళ్ల పొదలు పెరిగాయని, అధికారులు సకాలంలో వాటిని తొలగించకపోవడం వల్లనే గండి ఏర్పడిందని రైతులు పేర్కొంటున్నారు. కాల్వకు రంధ్రం ఏర్పడిందన్న విషయాన్ని అధికారులకు తెలియజేసినా ఆలస్యంగా రావడంతో నీరు వృథాగా పోయి పంట పొలాల్లోకి చేరడంతో రైతులు లబోదిబోమన్నారు. కొందరు అధికారులు అక్కడికి చేరుకొని పంట కాలువకు మరమ్మతులు చేయకుండా రిజర్వాయర్‌కున్న తూము గేటును బంద్ చేయడంతో పంట కాలువకు నీరు ఆగిపోయింది. ఈ విషయంపై అధికారులను వివరణ కోరగా పండగ సందర్భంగా ఎవరూ రాకపోవడంతో మరమ్మతులు చేయలేకపోయామని, ఒకటి రెండు రోజుల్లో కాలువకు మరమ్మతులు చేపడతామని అధికారులు తెలిపారు. అయితే పంట చేతికి వచ్చే సమయంలో పొలాలకు నీరు లేకపోతే పంటకు ఇబ్బంది కలుగుతుందని కొందరు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు త్వరగా పంట కాలువకు మరమ్మతులు చేసి నీటిని విడుదల చేయాలని రైతులు కోరారు.

పెన్షన్ సొమ్ము స్వాహా

- విచారించి రికవరీ చేసిన ఎంపిడిఒ

ప్రజాశక్తి - బండి ఆత్మకూర్

మండలంలోని చిన్నదేవళాపురం గ్రామంలో వితంతు పెన్షన్ లబ్ధిదారురాలు అడ్డాకుల విశ్రాంతమ్మకు 30 నెలలుగా పింఛన్ ఇవ్వకుండా వాలంటరీ కిషోర్ స్వాహా చేశాడు. ఈ విషయంపై ఫిర్యాదు మేరకు బండి ఆత్మకూరు ఎంపిడిఒ విజయరావు బుధవారం చిన్నదేవలాపురం గ్రామం వెళ్లి లబ్ధిదారురాలితో విచారించారు. 30 నెలల పెన్షన్ 78 వేల 750 రూపాయలు నగదును వాలంటీర్ నుండి రికవరీ చేసి లబ్ధిదారురాలు అకౌంట్‌కు జమ చేయించారు. ఎవరైనా ఇలాంటి అక్రమాలకు పాల్పడితే వెంటనే సమాచారం ఇవ్వాలని ఎంపిడిఒ ప్రజలకు విజ్ఞప్తి చేశారు.

బాబును కలిసిన ఏరాసు

ప్రజాశక్తి - ఆత్మకూర్

టిడిపి జాతీయ అధ్యక్షుడు చంద్రబాబు నాయుడును బుధవారం హైదరాబాద్‌లోని ఆయన స్వగృహంలో మాజీ మంత్రి ఏరాసు ప్రతాపరెడ్డి, ప్రముఖ బిల్డర్ రాఘవరెడ్డిలు మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా చంద్రబాబు నాయుడు నంద్యాల పార్లమెంట్ నియోజకవర్గం పరిధిలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు, పార్టీ గెలుపు విషయాలపై ఏరాసు ప్రతాపరెడ్డితో చర్చించినట్లు తెలిసింది. నంద్యాల పార్లమెంట్ పరిధిలోని అన్ని అసెంబ్లీ నియోజకవర్గాల్లో పార్టీ గెలుపు కోసం కృషి చేయాలని, ప్రచార కార్యక్రమాలలో పాల్గొనాలని చంద్రబాబు ఏరాసు ప్రతాపరెడ్డిని కోరినట్లు సమాచారం. నామినేషన్ల ప్రక్రియ ముగిసిన నాటి నుండి ఏరాసు ప్రతాపరెడ్డి టిడిపి అభ్యర్థుల గెలుపు కోసం ప్రచార కార్యక్రమంలో పాల్గొంటున్నట్టు తెలిసింది. ఇటీవల ఏరాసు ప్రతాపరెడ్డిపై సోషల్ మీడియాలో ఇతర పార్టీలోకి చేరుతున్నట్లు ప్రచారం జరుగుతున్న నేపథ్యంలో వీరి కలయిక వల్ల ఆ వదంతులకు తెర పడినట్లయింది.


చంద్రబాబును కలిసిన ఏరాసు, ప్రముఖ బిల్డర్ రాఘవరెడ్డి

గెలుపే ధ్యేయంగా పని చేయాలి

- శ్రీశైలం టిడిపి అభ్యర్థి బుడ్డా రాజశేఖర్ రెడ్డి

ప్రజాశక్తి - ఆత్మకూరు

ఎన్నికల్లో టిడిపి విజయకేతాన్ని శ్రీశైలం నియోజవర్గంలో ఎగురవేసే విధంగా, గెలుపే ధ్యేయంగా ప్రతి కార్యకర్త పని చేయాలని శ్రీశైలం ఎమ్మెల్యే టిడిపి అభ్యర్థి బుడ్డా రాజశేఖర్ రెడ్డి అన్నారు. బుధవారం స్థానిక పార్టీ కార్యాలయం వద్ద ముఖ్య కార్యకర్తల సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్యకర్తలు తమ వార్డులలో, గ్రామాలలో తోటి వారిని కలుపుకొని టిడిపి గెలుపు కోసం పని చేయాలన్నారు. పార్టీలో కొత్తగా చేరుతున్న వారిని కూడా కలుపుకోవాలని సూచించారు. నియోజవర్గంలో యువత ఎక్కువ శాతం ఉందని, ఆ యువతను పార్టీ వైపు నడిపించే బాధ్యత సీనియర్లు తీసుకోవాలన్నారు. మహిళా ఓటర్లకు పార్టీ ప్రకటించిన పథకాలను వివరించాలని సూచించా రు. ఈ రాబోవు రోజులు చాలా కీలకమైనవి గుర్తించి టిడిపి గెలుపు కోసం సమయాన్ని కేటాయించి పని చేయాలన్నారు. నియోజవర్గంలో టిడిపి జెండా ఎగరడం ఖాయమని, కార్యకర్తలు మరింత పట్టుదలతో పని చేసి మెజార్టీని తీసుకొచ్చేలా ఉండాలన్నారు. టిడిపి మండల అధ్యక్షులు శివప్రసాద్ రెడ్డి, పట్టణ అధ్యక్షులు జెట్టి వేణుగోపాల్, అబ్దుల్లాపురం బాషా, మైనార్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు కరిముల్లా, రజాక్, ప్రముఖ న్యాయవాది గోవిందరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టిడిపిలోకి వైసిపి జిల్లా కార్యదర్శి తిమోతి

ఆత్మకూర్ : వైసిపి జిల్లా కార్యదర్శి తిమోతి ఆ పార్టీకి రాజీనామా చేసి టిడిపి శ్రీశైలం అభ్యర్థి బుడ్డా రాజశేఖర్ రెడ్డి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఈయనతోపాటు 15వ వార్డుకు చెందిన దళిత కుటుంబాలు చేరారు. అలాగే పట్టణంలోని అర్బన్ కాలనీ వీధిలో నివాసం ఉంటున్న పలువురు వైసిపి కార్యకర్తలు చిన్న జమ్మన్న, మల్లికార్జున, బలరాం, శివలింగం, సోమన్న, సీనుతోపాటు 20 కుటుంబాలు టిడిపిలో చేరారు. ఈ సందర్భంగా బుడ్డా రాజశేఖర్ రెడ్డి మాట్లాడుతూ పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ప్రతి ఒక్కరు పార్టీ గెలుపు కోసం పని చేయాలని కోరారు. టిడిపి నాయకులు జెట్టి వేణుగోపాల్, న్యాయవాది గోవింద్ రెడ్డి, గిరి రాజు, అబ్దుల్లాపురం బాష పాల్గొన్నారు.


సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే బుడ్డా రాజశేఖర్ రెడ్డి

సిపి నగర్ వాసులు టిడిపిలో చేరిక

వెలుగోడు : పట్టణంలోని సిపి నగర్ కాలనీ వాసులు సీనియర్ నాయకులు కలాం, శంకర్ రెడ్డితో పాటు 30 కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే, శ్రీశైలం అసెంబ్లీ టిడిపి అభ్యర్థి బుడ్డా రాజశేఖర రెడ్డి సమక్షంలో టిడిపిలో బుధవారం చేరారు. కేశవ గౌడ్, కరిముల్లా తదితరుల ఆధ్వర్యంలో సిపి నగర్‌కు చెందిన పోచా వెంకటేశ్వర్లు రెడ్డి, పోచా రామిరెడ్డి, మహేష్ ఆచారి, సి.శ్రీనివాసులు, లింగేశ్వర రెడ్డి, డ్రైవర్ రాముడు, సత్యనారాయణ రెడ్డి, ముర్తుజా, షాలు, ఆటో రామిరెడ్డి తదితరులతో పాటు 30 కుటుంబాల వారికి బుడ్డా రాజన్న కండువా కప్పి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ఒక్క అవకాశం పేరుతో రాష్ట్రంలో అధికారంలోకి వచ్చిన వైసీపీ నమ్మి ఓటు వేసిన ప్రజలను, కార్యకర్తలను నట్టేట ముంచిందన్నారు. రానున్న ఎన్నికల్లో వైసిపికి ఓటు ద్వారా తగిన బుద్ధి చెప్పి టిడిపి అభ్యర్థి బుడ్డా రాజశేఖర రెడ్డిని అఖండ మెజారిటీతో గెలిపించుకుంటామని ధీమా వ్యక్తం చేశారు.


కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానిస్తున్న రాజశేఖర్ రెడ్డి

నూర్ బాష సంఘం జిల్లా అధ్యక్షులుగా శిల్పి సుబ్బరాయుడు

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

నూర్ బాషా సంఘం జిల్లా అధ్యక్షులుగా దూదేకుల శిల్పి సుబ్బ రాయుడును నియమించినట్లు నూర్ బాషా ముస్లిం సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షులు దూదేకుల దస్తగిరి తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర అధ్యక్షులు షేక్ సయ్యద్ బాజి ఆధేశాల ప్రకారం ఆళ్లగడ్డ నియోజకవర్గానికి చెందిన దూదేకుల శిల్పి సుబ్బరాయుడిని నంద్యాల జిల్లా అధ్యక్షులుగా నియమించామన్నారు. నంద్యాల జిల్లాలో క్రియాశీలకంగా వ్యవహరించి సంఘానికి, రాష్ట్ర అధ్యక్షులు షేక్ సయ్యద్ బాజికి మంచి పేరు తీసుకొని రావాలన్నారు. ఈ సందర్భంగా శిల్పి సుబ్బరాయుడుని దస్తగిరి అభినందించారు.


నియామక పత్రం అందుకుంటున్న సుబ్బరాయుడు

తల్లి మృతిని తట్టుకోలేక కుమారుడు..

- మృతుడు బలపాలపల్లి పిక్కిలి అంజి టిడిపి ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు

ప్రజాశక్తి - బేతంచర్ల

బేతంచర్ల మండలం బలపాలపల్లి గ్రామంలో తల్లి మరణాన్ని జీర్ణించుకోలేక టిడిపి ఎస్సీ సెల్ మండల ఉపాధ్యక్షుడు బలపాలపల్లి పిక్కిలి అంజి (44) మృతి చెందిన ఘటన బుధవారం చోటు చేసుకుంది. వివరాలు.. ఉగాది పండగ రోజు మంగళవారం రాత్రి అంజి తల్లి పిక్కిరి లచ్చమ్మ (68) ఇంటి వద్ద మృతి చెందింది. బుధవారం ఉదయం తల్లి అంత్యక్రియలు ముగిసిన తర్వాత పిక్కిలి అంజి ఇంటికి చేరుకున్నాడు. అంజి తల్లి మృతి పట్ల మదనపడుతుండగా ఉన్నట్లుండి దగ్గు రావడంతో నోటిలో నుండి రక్తం పడింది. వెంటనే కుటుంబ సభ్యులు బేతంచెర్లలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. వైద్యులు పరీక్షించి పరిస్థితి విషమంగా ఉందని, కర్నూలుకు తీసుకెళ్లాలని సూచించారు. అక్కడి నుండి అంజిని వాహనాంలో కర్నూలు ప్రభుత్వ వైద్యశాలకు తరలిస్తుండగా మార్గమధ్యలోనే మృతి చెందాడు. తల్లి అంత్యక్రియలు ముగిసిన గంటల వ్యవధిలోనే కుమారుడు మృతి చెందడంతో కుటుంబ సభ్యుల రోధనలు మిన్నంటాయి. విషయం తెలిసిన ఎస్సీ సెల్ మండల, పట్టణ అధ్యక్షులు సిమెంట్ నగర్ రాముడు, గూటం శివలతో పాటు పలువురు టిడిపి నాయకులు బలపాలపల్లెకు చేరుకుని అంజి మృతదేహానికి నివాళ్లులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు.



వడ్డేమాన్‌లో టిడిపి ఎన్నికల ప్రచారం

ప్రజాశక్తి - నందికొట్కూరు టౌన్

నందికొట్కూరు మండలం వడ్డేమాను గ్రామంలో టిడిపి నాయకులు సత్యం రెడ్డి, నాగేశ్వర్ రెడ్డి, రామచంద్రుడు,అల్లి హుస్సేన్ ఆధ్వర్యంలో నాయకులు మాండ్ర లింగారెడ్డి, నందికొట్కూరు నియోజకవర్గ టిడిపి అభ్యర్థి జయసూర్య బుధవారం ఎన్నికల ప్రచారం నిర్వహించారు. టిడిపి మేనిఫెస్టో, సూపర్ సిక్స్ పథకాల గురించి ఇంటింటికి తిరిగి ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గిత్త జయసూర్య మాట్లాడుతూ జరగబోయే సార్వత్రిక ఎన్నికల్లో తనను భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, ముర్తు జావలి, పల్లె రమణారెడ్డి, కర్ణాకర్ రెడ్డి, వీరాపురం వెంకటరాముడు, రాఘవరెడ్డి, ఇబ్రహీం, గజేంద్రనాయుడు, కుమార్, బ్రహ్మం నాయుడు, అశోక్, వెంకటేశ్వర్లు, శీను, మధుసూదన్ నాయుడు, శేఖర్ నాయుడు, ఏల్లుయాదవ్, దిలీప్ కుమార్ నాయుడు, అల్లూరు టిడిపి నాయకులు వెంకటేశ్వర్లు, చిన్న నాగలక్ష్మయ్య, బాలకృష్ణ, వెంకటరమణ, మహేష్, విష్ణువర్ధన్ రెడ్డి, చిన్న రాజు, స్వాములు, వడ్డే హుస్సేన్, కార్యకర్తలు పాల్గొన్నారు.


నందికొట్కూరులో ప్రచారం నిర్వహిస్తున్న టిడిపి నాయకులు

ఒక్క అవకాశమివ్వండి : గిత్త జయసూర్య

కొత్తపల్లి : గ్రామీణ ప్రాంతాల ప్రజలు ఒక్కసారి ఆలోచించి ఒక్క అవకాశం ఇస్తే అభివృద్ధి చేసి చూపిస్తామని నందికొట్కూరు టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి గిత్త జయసూర్య తెలిపారు. బుధవారం మండలంలోని వీరాపురం, కొత్త మాడుగుల గ్రామాల్లో ఎన్నికల శంఖారావం కార్యక్రమం నిర్వహించి ఇంటింటికి వెళ్లి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2019 ఎన్నికలలో జగన్మోహన్ రెడ్డికి ఒక్క అవకాశం ఇచ్చి అభివృద్ధి కోల్పోయామన్నారు. ప్రజలందరూ గమనించి రాబోయే ఎన్నికల్లో టిడిపికి అవకాశం ఇస్తే గ్రామాలను అభివద్ధి పథంలో నడుపుతామన్నారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు మాండ్ర సురేంద్రనాథ్ రెడ్డి, రాజశేఖర్ రెడ్డి, రామిరెడ్డి, రవి, భూషన్న, శంకర్, ప్రభాకర్, ఏసన్న, నాగన్న, కృష్ణ, కన్వీనర్ నారపురెడ్డి, క్లస్టర్ కోఆర్డినేటర్ లింగస్వామిగౌడ్, శ్రీనాథ్ రెడ్డి, నాగేశ్వరరావు, మోహన్, మల్లికార్జున, రాధాకృష్ణారెడ్డి, శేఖర్, మారెన్న, నాగార్జునగౌడ్, సుబ్బయ్య, చంద్రగౌడ్, జానకిరాముడు, పరమేశ్వరరెడ్డి, శివారెడ్డి, జడ్ వెంకటరెడ్డి, బుచ్చిరెడ్డి, స్వామిరెడ్డి, ప్రశాంత్ రెడ్డి, సుబ్బరాయుడు, లింగన్న, వెంకటస్వామి, జహురూల్ల, రవి, దాసు, స్వాములు, లింగస్వామి, చంద్రనాయిక్, రాజు, శివపురం శేఖర్ తదితరులు పాల్గొన్నారు.


కొత్తపల్లి ప్రచారంలో జయసూర్య

ప్రచారానికి దూరం.. దూరం...

- బిజెపిలో నాయకుల మధ్య లుకలుకలు
- కలుపుగోలుతనం లేదని కూటమి అభ్యర్థి పార్థసారథిపై అసహనం

ప్రజాశక్తి - ఆదోని

రాష్ట్రంలో ఎన్నికల వేడి రోజురోజుకు వేడెక్కుతోంది. ఎన్నికల షెడ్యూల్కు సమయం దగ్గర పడుతోంది. వచ్చిన అవకాశాన్ని గెలుపునకు అనుకూలంగా మలుచుకుంటూ అభ్యర్థులు దూసుకుపోతున్నారు. ఆదోనిలో మాత్రం రాజకీయ వేడి ఇంకా మొదలు కాలేదని చెప్పవచ్చు. అధికార పార్టీ వైసిపి తరపున సిట్టింగ్ ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి ఎన్నికల బరిలో ఉన్నారు. టిడిపి, జనసేన, బిజెపి కూటమి అభ్యర్థిగా డాక్టర్ పార్థసారథిని ప్రకటించారు. అభ్యర్థి ప్రకటన నాటి నుంచి పార్టీల మధ్య సఖ్యత కొరవడి నాయకులు 'దూరం.. దూరం' అంటూ అంటి ముట్టనట్లు వివరిస్తున్నట్లు సమాచారం. అభ్యర్థి స్థానికేతరుడు కావడం వల్ల ఆదోని నియోజకవర్గంలో వైసిపి అభ్యర్థి సాయి ప్రసాద్ రెడ్డి లక్ష ఓట్ల మెజార్టీతో గెలవడం ఖాయమని సోషల్ మీడియా వేదికగా ట్రోల్ నడుస్తోంది. డాక్టర్ పార్థసారథి మాత్రం ఇప్పటికీ నామమాత్రంగా ప్రచారం నిర్వహిస్తూ నాయకులను ఒకే తాటిపైకి తీసుకురావడంలో విఫలం చెందారని కూటమి నాయకులు చెబుతున్నారు. 2009లో కోట్ల జయసూర్య ప్రకాష్ రెడ్డి కాంగ్రెస్ అభ్యర్థిగా బరిలో నిలిచినప్పటికీ నాన్ లోకల్ అన్న కారణంగా ఆయనను ఓడించారని, ఆదోని ఓటర్లు ఇతరులను గెలిపించిన దాఖలాలు లేవని చర్చలు నడుస్తున్నాయి. ఇక్కడ లోకల్ సెంటిమెంట్ బలంగా ఉందంటూ టిడిపి, జనసేన, బిజెపి నాయకులు అభిప్రాయాలను వ్యక్తం చేస్తున్నారు.

మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదు

బిజెపి, టిడిపి, జనసేన కూటమి అభ్యర్థిగా డాక్టర్ పార్థసారథి కలుపుగోలుతనం లేదని, ఎన్నికల్లో జనసేన తరపున మద్దతు ఇచ్చే ప్రసక్తే లేదని జనసేన ఇన్ఛార్జీ మల్లప్ప ఇటీవల బహిరంగంగానే ప్రకటన చేశారు. కనీసం మర్యాద కూడా ఇవ్వడం లేదని, అలాంటి వ్యక్తితో తామెలా కలిసేది అంటూ అసహనం వ్యక్తం చేశారు. ఆయన ఒంటరిగానే ప్రచారం చేస్తున్నారని, కనీసం జనసేన పొత్తులో ఉందన్న సంగతి కూడా మర్చిపోయినట్లు ఉన్నారని పేర్కొంటున్నారు. ఇది పద్ధతి కాదంటూ, అవసరమైతే ఇండిపెండెంట్గా పోటీ చేస్తామని మల్లప్ప ప్రకటన చేయడంతో రాజకీయ దుమారం చెలరేగింది. గత ఎన్నికల్లో సుమారు 12 వేల ఓట్లు వచ్చాయని, ఐదేళ్లుగా నియోజకవర్గ ప్రజలకు అందుబాటులో ఉంటూ అధికార పార్టీ విధానాలను ఎండగడుతూ తాము రాజకీయ పునాది నిలుపుకున్నామని పేర్కొంటున్నారు.

బిజెపి నాయకుల మధ్య లుకలుకలు

కూటమి అభ్యర్థిగా ప్రకటన వచ్చి వారం గడిచింది. బిజెపి నాయకుల మధ్యనే సఖ్యత కొరవడింది. కనీసం మర్యాదపూర్వకంగా కూడా తమను కలవడం లేదని బిజెపి నాయకులు పేర్కొంటున్నట్లు తెలిసింది. బిజెపి అభ్యర్థిగా అవకాశం ఇవ్వాలంటూ మాజీ ఎమ్మెల్యే ప్రకాష్ జైన్, వ్యాపారవేత్త విట్టా రమేష్, వంశీ చైతన్య నర్సింగ్ హోమ్ మేనేజింగ్ డైరెక్టర్ రమేష్ యాదవ్లు ప్రయత్నం చేశారు. జిల్లా అధ్యక్షులు కునిగిరి నీలకంఠను మినహా తమను పట్టించుకోవడం లేదని డాక్టర్ పార్థసారథిపై అధిష్టానానికి ఫిర్యాదు చేసినట్లు తెలిసింది.

అంటి ముట్టనట్టు టిడిపి నాయకులు

టిడిపి నుంచి టికెట్ కోసం తీవ్ర ప్రయత్నాలు చేసిన సంగతి తెలిసిందే. మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, సూరం భాస్కర్ రెడ్డి, గుడిసె ఆది కృష్ణమ్మ, మాన్వి దేవేంద్రప్ప, సౌదీ రావుఫ్ వేర్వేరుగా ప్రయత్నం చేసి విఫలమయ్యారు. ఐదేళ్లుగా పార్టీని నడిపిస్తూ ఆర్థికంగా నష్టపోయామని, కనీసం ఆ దిశగా చర్చలు కూడా జరపడంలో కూటమి అభ్యర్థి పార్థసారథి శ్రద్ధ చూపడం లేదని నాయకులు చెబుతున్నారు. వైసిపి అభ్యర్థి సాయి ప్రసాద్ రెడ్డి ఇప్పటికే గ్రౌండ్ లెవెల్లో నాయకులను కలుస్తూ మద్దతు కూడగట్టుకుంటున్నారు. సోషల్ మీడియాలో తప్ప కనీసం ప్రెస్మీట్ కూడా ఏర్పాటు చేయలేని పరిస్థితిలో డాక్టర్ పార్థసారథి ఉన్నారని అసంతృప్తి వ్యక్తం చేస్తున్నారు. ఆదివారం ఎన్నికల ప్రచారం మొదలు పెట్టినప్పటికీ మాజీ ఎమ్మెల్యే మీనాక్షి నాయుడు, మాన్వి దేవేంద్రప్ప, బిజెపి జిల్లా అధ్యక్షులు కునిగిరి నీలకంఠ, టిడిపి మాజీ ఇన్ఛార్జీ గుడిసె ఆది కృష్ణమ్మ, శ్రీకాంత్రెడ్డి హాజరయ్యారు. మేదరి గేరి నుంచి ప్రచారం ప్రారంభమైంది. కొద్దిసేపటికే ముఖ్య నాయకులు వెనుదిరిగి వెళ్లడంతో పదుల సంఖ్యలో మాత్రమే కార్యకర్తలు పార్థసారథి వెంట నడుస్తూ మున్సిపల్ రోడ్డులో డోర్ టు డోర్ ప్రచారం చేశారు. కలుపుగోతనం లేకపోవడం వల్ల కనీసం గట్టి పోటీ కూడా ఇవ్వలేని పరిస్థితి ఉందని టిడిపి, జనసేన, బిజెపి నాయకులు బహిరంగంగానే చెబుతున్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న డాక్టర్ పార్థసారథి (ఫైల్)



కండువా కప్పి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సాయిప్రసాద్ రెడ్డి

వైసిపిలోకి 'దూదేకుల సంఘం'

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

నియోజకవర్గంలోని పలువురు దూదేకుల సంఘం సభ్యులు, ఆ సంఘం అధ్యక్షులు బాజీ సాబ్ ఆధ్వర్యంలో సుమారుగా 50 మందికిపైగా బుధవారం ఎమ్మెల్యే సాయి ప్రసాద్ రెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా సుపరిపాలనే లక్ష్యంగా పని చేస్తున్న ఏకైక ప్రభుత్వం వైసిపి అని తెలిపారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమం అందిస్తూ, అభివృద్ధి లక్ష్యంగా, హామీలను వంద శాతం నెరవేర్చినట్లు చెప్పారు. రానున్న ఎన్నికల్లో మళ్లీ వైసిపి విజయకేతనం ఎగురవేస్తుందని ధీమా వ్యక్తం చేశారు. భవిష్యత్తులో మరింత సంక్షేమం, అభివృద్ధి జరగనుందని తెలిపారు.

తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు : సర్పంచి



సమస్య ఉన్న కాలనీలకు నీటి సరఫరా చేస్తున్న సర్పంచి

ప్రజాశక్తి - చిప్పగిరి

అసలే వేసవి అని, ఏ గ్రామంలో చూసినా తాగునీటి కష్టాలు ఉంటాయని, తాగునీటి ఎద్దడి నివారణకు చర్యలు తీసుకుంటున్నామని నేమకల్లు సర్పంచి ప్రేమ్ కుమార్ తెలిపారు. బుధవారం ఆయన మాట్లాడారు. పండగ పూట ప్రజలు తాగునీటికి ఇబ్బంది పడకూడదని నాలుగు రోజుల నుంచి గ్రామంలోని ఏ కాలనీలో తాగునీటి కొరత ఉందో తెలుసుకొని వెంటనే ట్రాక్టర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నట్లు తెలిపారు. గ్రామంలో కొన్ని కాలనీలకు కొంతమంది మోటార్లు వేసుకోవడం ద్వారా చివరగా ఉన్న వారికి నీరు అందడం లేదని చెప్పారు. వారందరికీ ట్రాక్టర్లు, ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నామన్నారు. గ్రామంలో శ్రీరామనవమి ఉత్సవాలు ప్రారంభం అవుతున్నందున మరింత బాధ్యతతో ఎక్కువ ట్రాక్టర్లు, ట్యాంకర్లు పెట్టి తాగునీటిని సరఫరా చేసేందుకు సిద్ధంగా ఉన్నామని తెలిపారు. నీటిని సరఫరా చేస్తున్నందుకు గ్రామస్తులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు.

'ఆజాద్' సీట్ల సునామీ

ప్రజాశక్తి - ఆస్పరి

ఆస్పరిలో ఆజాద్ కోచింగ్ సెంటర్ సీట్ల సునామీ సృష్టిస్తోంది. కోచింగ్ సెంటర్లో నవోదయ, గురుకుల, సైనిక్, ఎపిఆర్జెసి, పాలిటెక్నిక్ ప్రవేశాల కోసం శిక్షణ ఇస్తారు. నిష్ణాతులైన ఉపాధ్యాయులతో శిక్షణ ఇస్తుండడంతో ప్రతేడాది ఫలితాల్లో ప్రభంజనం సృష్టిస్తోంది. ఈ ఏడాది నవోదయలో అబ్దుల్ ఆజాద్, నాని, చరిత, ధర్మ తేజలు నవోదయ ప్రవేశ పరీక్షలో ఉత్తమ ప్రతిభ కనబరిచి ఆలూరు బ్లాక్ సంబంధించి నాలుగు సీట్లు సాధించారు. ఎపిఆర్జెసి, పాలిటెక్నిక్ ప్రవేశ పరీక్షల్లో 32 మంది ప్రతిభ కనబరిచి సీటు సాధించారు. గతేడాది గురుకుల ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించారు. మెంటలిబులిటీ మ్యాస్పై, ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధతో సునాయాసంగా అర్థమయ్యేటట్లు, తగిన మెళకువలతో బోధన చేసి ప్రాక్టీస్ చేయిస్తున్నారు. డైలీ టెస్ట్, వీక్లీ టెస్ట్, గ్రాండ్ టెస్ట్లు నిర్వహిస్తారు. తెలుగు, ఇంగ్లీష్ మీడియంలో విద్య బోధన అనుభవం గల అధ్యాపకులతో ఉంటుంది.



విద్యార్థులను అభినందిస్తున్న సిఐ హనుమంతప్ప

భారీ నగదు స్వాధీనం

ప్రజాశక్తి - ఆదోని

ఆదోని రైల్వే స్టేషన్లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు తనిఖీలు నిర్వహించి భారీగా నగదును స్వాధీనం చేసుకున్నారని డిఎస్పి శివ నారాయణ స్వామి తెలిపారు. బుధవారం టూ టౌన్ పోలీసు స్టేషన్లో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో స్వాధీనం చేసుకున్న నగదును ప్రవేశపెట్టారు. ఈ సందర్భంగా డిఎస్పి శివ నారాయణ స్వామి, ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారి హరింద్ర మాట్లాడారు. ఎన్నికల నేపథ్యంలో పోలీసులు, ఫ్లయింగ్ స్క్వాడ్ సంయుక్తంగా దాడులు నిర్వహిస్తామని తెలిపారు. అందులో భాగంగానే ఆదోని రైల్వే స్టేషన్లో ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు వ్యక్తిపై అనుమానం వచ్చి బ్యాగు తనిఖీ చేయగా రూ.37 లక్షల నగదు లభించిందన్నారు. ఆ నగదుకు సంబంధించి ఎలాంటి రసీదులు చూపించకపోవడంతో రెండో పట్టణ పోలీసులకు ఫ్లయింగ్ స్క్వాడ్ అధికారులు నగదును అప్పగించారని తెలిపారు. మల్లికార్జున అనే వ్యక్తిని రెండో పట్టణ పోలీసులు అదుపులో తీసుకొని నగదును సీజ్ చేసినట్లు చెప్పారు. ఆదాయపు పన్ను అధికారులకు అప్పగిస్తామని వెల్లడించారు. రెండో పట్టణ సిఐ గోపి, కానిస్టేబుల్ బ్రహ్మానంద రెడ్డి, పోలీసులు ఉన్నారు.



నగదు చూపుతున్న పోలీసులు

17 మంది వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి-ఆదోనిరూరల్

మండలంలోని ధణాపురం గ్రామానికి చెందిన 10మంది, బైచిగేరి గ్రామానికి చెందిన మరో ఏడుగురు వాలంటీర్లు రాజీనామా చేశారు. బుధవారం తమ రాజీనామా పత్రాన్ని ఆదోని ఇన్ఛార్జీ ఎంపిడిఒ విజయశేఖర రావుకు, ఇన్ఛార్జీ ఇఒఆర్డి నాగరాజుకు అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. వ్యక్తిగత కారణాల వల్ల వాలంటీరు ఉద్యోగానికి రాజీనామా చేస్తున్నట్లు తెలిపారు. ఎన్నికల కోడ్ కారణంగా ఇబ్బంది పెడుతున్నారని చెప్పారు.



రాజీనామా పత్రాన్ని అందిస్తున్న వాలంటీర్లు

పకడ్బందీగా ఎన్నికల నిర్వహణ

- సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ

ప్రజాశక్తి - ఆదోని

ఎలాంటి వివాదాలకూ తావివ్వకుండా ఎన్నికల ప్రక్రియ పకడ్బందీగా నిర్వహించాలని ఎన్నికల అధికారి, సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ సూచించారు. బుధవారం పట్టణంలోని రోషన్ గార్డెన్లో ఎన్నికల అధికారులకు శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. పోలింగ్ సమయంలో ఎటువంటి ఇబ్బందులకూ గురికాకుండా స్పష్టమైన అవగాహన కలిగి ఉండాలని తెలిపారు. నియోజకవర్గంలో 256 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన పిఒ, ఎపిఒలకు గత వారంలోనే జిల్లాస్థాయిలో ఎన్నికల నిర్వహణపై శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. గత ఎన్నికల్లో అందరి అనుభవం చూసుకుంటే ఈవిఎమ్లు సరిగ్గా కనెక్ట్ చేయనందున పని చేయడం లేదనే అపోహలతో కంగారుపడిన సందర్భాలు ఎదురై ఉండొచ్చని తెలిపారు. అలాంటి పరిస్థితి మళ్లీ రాకూడదనే పిఒ, ఎపిఒలకు ఈ శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్లు చెప్పారు. ప్రతి నలుగురికీ ఒక టేబుల్ ఏర్పాటు చేయడంతో పాటు హ్యాండ్సన్ ట్రైనింగ్ పూర్తిగా ఇవ్వాలని ఈవిఎమ్ మెషిన్ సెట్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. వాటి ద్వారా ప్రతి ఒక్కరూ ఈవిఎమ్ మెషీన్ కనెక్షన్ ఏ విధంగా చేయాలి, ఏ విధంగా డిస్కనెక్ట్ చేయాలనే విషయాలను పిఒ, ఎపిఒలు సొంతంగా నేర్చుకొని, పోలింగ్ రోజున ఎటువంటి ఇబ్బందులకు గురికాకుండా ఉంటారని చెప్పారు. మే 13న పోలింగ్ ఉంటుందని, మే 12న మెటీరియల్ డిస్ట్రిబ్యూట్ చేసిన తర్వాత మెటీరియల్ మొత్తం వచ్చిందో, లేదో, అని ఏ విధంగా చెక్ చేసుకోవాలి, పోలింగ్ కేంద్రానికి వెళ్లిన తర్వాత ఏం చేయాలి, పోలింగ్ కేంద్రం ఏ విధంగా ఏర్పాటు చేసుకోవాలనే వాటి మీద కూడా శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. అనంతరం పిఒలు, ఎపిఒలు ఏవిధంగా ఈవిఎమ్ మెషీన్ కనెక్ట్ చేస్తున్నారు, మాక్ పోల్ ఏ విధంగా నిర్వహించి క్లియర్ చేస్తున్నారని సబ్ కలెక్టర్ ప్రత్యక్షంగా ప్రతి టేబుల్ వద్దకు వెళ్లి వారు చేస్తున్న పని తీరును పరిశీలించారు. ఆదోని తహశీల్దార్ హసీనా సుల్తానా, డిఎల్పిఒ కార్యాలయపు పరిపాలన అధికారి వీరభద్రప్ప, డిప్యూటీ తహశీల్దార్లు రుద్ర గౌడ్, వలీబాషా, మాస్టర్ ట్రైనర్లు ఆదిమూర్తి, సుధాకర్ ఉన్నారు.



మాట్లాడుతున్న సబ్ కలెక్టర్ శివ నారాయణ శర్మ


నివాళులర్పిస్తున్న మాజీ సర్పంచి బిసి రాజారెడ్డి

ముస్లిం మైనారిటీ మహిళ మృతి

- నివాళ్లులర్పించిన మాజీ సర్పంచి రాజారెడ్డి

ప్రజాశక్తి - బనగానపల్లె : పట్టణానికి చెందిన ఉర్దూ టీచర్ సయ్యద్ ఫయాజ్ తల్లి సయ్యద్ హసీనా బేగం (75) బుధవారం అకస్మాత్తుగా మృతి చెందారు. విషయం తెలుసుకున్న బనగానపల్లె పట్టణ మాజీ సర్పంచ్ బిసి.రాజారెడ్డి వారి ఇంటికి వెళ్లి ఆమె మృతదేహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు.

మోటార్ సైకిల్ ఢీకొని వ్యక్తి మృతి

ప్రజాశక్తి - బనగానపల్లె : పట్టణంలోని శివారు ప్రాంతం ఆర్ఆర్ ఫంక్షన్ హాల్ సమీపంలో బుధవారం రెండు బైక్‌లు ఎదురెదురుగా వచ్చి ఢీకొన్న ఘటనలో చాగలమర్రికి చెందిన చెందిన జమాల్ బాషా (30) అక్కడిక్కడే మృతి చెందాడు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రామిరెడ్డి తెలిపారు.


మృతి చెందిన జమాల్ బాషా


ఫరూక్‌ను పరామర్శిస్తున్న కాంగ్రెస్ అభ్యర్థి గోకుల్ కృష్ణా రెడ్డి

ఎన్ఎండి ఫరూక్‌కు పలువురి పరామర్శ

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

రోడ్డు ప్రమాదంలో స్వల్ప గాయలై నంద్యాల ఇంటెన్సీవ్ ట్రామా కేర్ ప్రయివేట్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి, నంద్యాల అసెంబ్లీ టిడిపి అభ్యర్థి ఎన్ఎండి ఫరూక్‌ను బుధవారం పలువురు పరామర్శించారు. మాజీ మంత్రి, ఆళ్లగడ్డ అభ్యర్థి భూమా అఖిల ప్రియ దంపతులు, ఆమె సోదరుడు భూమా జగత్ విఖ్యత్ రెడ్డి, కాంగ్రెస్ పార్టీ నంద్యాల అభ్యర్థి గోపవరం గోకుల్ కృష్ణారెడ్డిలు ఆసుపత్రి వద్దకు వెళ్లి ఫరూక్‌ను పరామర్శించి ఆయన ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. ఫరూక్ త్వరగా కోలుకొని ఎన్నికల ప్రచారంలో పాల్గొనాలని భూమా అఖిలప్రియ ఆకాంక్షించారు.

హాస్పటల్ ననుండి డిశ్చార్జి అయిన ఎన్ఎండి ఫరూక్ : ఆరోగ్యం నిలకడగా ఉండటంతో ఎన్ఎండి ఫరూక్ ఆసుపత్రి నుండి మధ్యాహ్నం డిశ్చార్జి అయ్యారు. అనంతరం ఫరూక్ నంద్యాల నుండి హైదరాబాద్‌కు బయలుదేరి వెళ్లారు.

ఫరూక్‌ను పరామర్శించిన ఇరిగెల

ఆళ్లగడ్డ : రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న మాజీ మంత్రి, నంద్యాల అసెంబ్లీ టిడిపి ఎమ్మెల్యే అభ్యర్థి ఫరూక్‌ను జనసేన పార్టీ తాలూకా అధికార ప్రతినిధి ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి పరామర్శించారు. కార్యక్రమంలో జనసేన నాయకులు జున్ను ప్రసాద్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.


పరామర్శిస్తున్న ఇరిగెల సూర్యనారాయణ రెడ్డి

కలిసిన రాజకీయ ప్రత్యర్థులు

- భూమా, ఇరిగెల కుటుంబాలను కలిపిన బైరెడ్డి

ప్రజాశక్తి - ఆళ్లగడ్డ

దశాబ్దాలుగా రాజకీయ ప్రత్యర్థులుగా ఉన్న భూమా, ఇరిగెల కుటుంబాలు మాజీ ఎమ్మెల్యే, టిడిపి సీనియర్ నాయకులు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి చొరవతో కలిశారు. ఇటీవలే బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆళ్లగడ్డలో ఇరిగెల సోదరులతో సమావేశమయ్యారు. దీనికి తోడు కేంద్ర కాటన్ బోర్డు సభ్యులు సిపి శ్రీనివాసరెడ్డి (వాసు) కూడా ఇరిగెల అఖిలప్రియ కుటుంబాలను కలిపేందుకు తన వంతు కృషి చేశారు. బుధవారం కర్నూలులోని ఆటో నగర్‌లో ఉన్న బైరెడ్డి స్వగృహంలో నంద్యాల ఎంపీ అభ్యర్థి డాక్టర్ బైరెడ్డి శబరి తండ్రి బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ఆధ్వర్యంలో మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ, ఇరిగెల రాంపుల్లారెడ్డి కుటుంబాలతో చర్చలు జరిపారు. చర్చలు ఫలించడంతో భూమా, ఇరిగెల కుటుంబాలు కలిసిపోయాయి. టిడిపి, జనసేన పొత్తులో భాగంగా ఎన్నికలలో విజయం కోసం ఇరిగెల రాంపుల్లారెడ్డి, ఇరిగెల సోదరులను, నియోజకవర్గ టిడిపి అభ్యర్థి భూమా అఖిలప్రియ, భూమా జగద్విఖ్యాత్ రెడ్డి, భార్గవరామ్‌లతో బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి చర్చలు జరిపి చర్చలను విజయవంతం చేశారు. దాదాపు 33 సంవత్సరాల తర్వాత భూమా, ఇరిగెల కుటుంబాలు టిడిపి విజయం కోసం ఏకమయ్యాయి. గతంలో మాజీ మంత్రి గుండ్లకుంట శివారెడ్డి 1991లో భూమా నాగిరెడ్డి గెలుపు కోసం బోరెడ్డి కుమారులైన ఇరిగెల రాంపుల్లారెడ్డి ఆయన సోదరులు ఎన్నికల్లో గెలుపు కోసం కలిశారు. అప్పట్లో భూమా నాగిరెడ్డి గెలుపు సాధించారు. ప్రస్తుతం టిడిపి ఎంపీ అభ్యర్థి బైరెడ్డి శబరి కోసం ఆమె తండ్రి బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి ప్రత్యేక శ్రద్ధతో భూమా, ఇరిగెల కుటుంబాలను ఏకం చేశారు. దీంతో ఆళ్లగడ్డలో కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి భూమా అఖిల ప్రియ గెలుపు, ఎంపి అభ్యర్థి బైరెడ్డి శబరికి మంచి మెజార్టీ వచ్చే అవకాశాలు మెండుగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు భావిస్తున్నారు. ఏదేమైనా భూమా, ఇరిగెల కుటుంబాలు ఏకం కావడం ఉమ్మడి జిల్లాలో చర్చనీయాంశంగా మారింది.

రానున్నది టిడిపి ప్రభుత్వమే : రానున్నది టిడిపి ప్రభుత్వమేనని టిడిపి సీనియర్ నాయకులు బైరెడ్డి రాజశేఖర్ రెడ్డి అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రానున్న ఎన్నికల్లో టీడీపీ గెలుపు కోసం అందరం కలసికట్టుగా పని చేసేందుకు సిద్ధంగా ఉన్నామన్నారు. మాజీ మంత్రి భూమా అఖిల ప్రియ మాట్లాడుతూ రెండు కుటుంబాల కలయికతో ఎమ్మెల్యేగా తాను, నంద్యాల ఎంపీ అభ్యర్థిగా డా.బైరెడ్డి శబరి భారీ మెజార్టీతో గెలుస్తామని తెలిపారు. కూటమి పార్టీల నేతలతో కలిసి ప్రచారం కొనసాగిస్తామన్నారు. ఇరిగెల రాంపుల్లారెడ్డి మాట్లాడుతూ కూటమి అభ్యర్థుల గెలుపు కోసం సమిష్టిగా కృషి చేస్తామన్నారు. త్వరలో ఉమ్మడి కార్యాచరణపై సమావేశం ఏర్పాటు చేసి జనసేన తరపున పూర్తి సహకారం అందిస్తామని తెలిపారు. కార్యక్రమంలో నంద్యాల పార్లమెంట్ టీడీపీ అభ్యర్థి డా.బైరెడ్డి శబరి, భూమా, ఇరిగెల కుటుంబ సభ్యులు, వారి అనుచరులు పాల్గొన్నారు.


బైరెడ్డి చొరవతో కలిసిన భూమా, ఇరిగెల కుటుంబాలు

22 కుటుంబాలు వైసిపిలో చేరిక

ప్రజాశక్తి - బనగానపల్లె

పట్టణంలోని ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి నివాసంలో అవుకు మండలం శివవరం గ్రామానికి చెందిన 22 కుటుంబాలు టిడిపిని వీడి వైసిపిలో బుధవారం చేరారు. శివవరం గ్రామానికి చెందిన టిడిపి నాయకులు ఎలిసా, పేరు మాల చెన్నప్ప, పేరుమాల చంద్రశేఖర్, చెన్నయ్య, ఐజయ్య,దావీదు, జయన్న, పక్కిర, పొట్టిపాడు యాకోబు, బండి చిన్నపక్కిర, బూర్గుల వినోద్ కుమార్, తోకల విజయ్, తోకల దావీదు, తోకల జోసెఫ్, బూర్గుల విజయకుమార్, బండి దానమయ్య, తోకల ఓబులేసు, బండి పెద్ద హుసేనయ్య, బండి చిన్న హుస్సేనయ్య, ఎద్దుల చెన్నయ్య, పేరు సోముల కర్ణమ్మ, పేరుసోముల భాగ్యమ్మ తదితరులు వైసీపీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి వైసిపి కండువాలు కప్పి పార్టీలోని ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి సహకారాలతో తాను చేపడుతున్న నియోజకవర్గం అభివృద్ధికి ఆకర్షితులై వైసిపి చేరుతున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో శివవరం వైసిపి నాయకులు విరుపాక్షి రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.


ఎమ్మెల్యే సమక్షంలో వైసీపీలో చేరుతున్న టిడిపి నాయకులు

కమాండ్ కంట్రోల్ రూమ్‌ను సందర్శించిన కలెక్టర్

ప్రజాశక్తి - నంద్యాల కలెక్టరేట్

ఎన్నికల సమాచారానికి సంబంధించి కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన జిల్లా ఇంటిగ్రేటెడ్ కమాండ్ కంట్రోల్ రూమ్‌ను జిల్లా కలెక్టర్ కె.శ్రీనివాసులు బుధవారం ఆకస్మికంగా సందర్శించారు. కంట్రోల్ రూమ్‌లో పోల్ డే మానిటరింగ్, రిపోర్ట్స్ మానిటరింగ్, సోషల్ మీడియా సెల్, మీడియా మానిటరింగ్, కాల్ సెంటర్, కంప్లైంట్స్ మానిటరింగ్, జిపిఎస్ మానిటరింగ్, వెబ్ కాస్టింగ్, ఎక్స్పెండిచర్ మానిటరింగ్, ఎంసీసి టీంలను సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఎన్నికల ప్రవర్తన నియమావళి అమలులో ఉన్నప్పటి నుండి ఇప్పటివరకు జిల్లా వ్యాప్తంగా రూ.3,06,69,170 నగదు, రూ. 65,43,455 విలువైన 34,827 లీటర్ల మద్యం, రూ.9,822 విలువైన 2,186 గ్రాముల మాదకద్రవ్యాలు, రూ.38,45,960 విలువైన 3,027 గ్రాముల ఆభరణాలు, రూ.8,51,406 విలువైన ఇతర వస్తువులను సీజ్ చేశామన్నారు. ఎన్నికల కోడ్ ఉల్లంఘనపై మొత్తం 129 ఫిర్యాదులు అందగా 48 పరిష్కరించామని, 81 ఫిర్యాదులకు సరైన పత్రాలు లేనందున తిరస్కరించినట్లు తెలిపారు. రాజకీయ పార్టీ అనుచరులకు సంబంధించి టిడిపి 11 మందిని, వైఆర్సీపీ 15 మంది, ఇతరులు 8 మందిపై కేసులు నమోదు చేశామన్నారు.

ఆర్యవైశ్యులకు అండగా ఉంటా : ఎమ్మెల్యే

ప్రజాశక్తి - అవుకు : అవుకు మండలంలోని ఆర్యవైశ్యులకు ఎల్లవేళలా అందుబాటులో ఉండి వారికి అండగా ఉంటానని బనగానపల్లె ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి అన్నారు. బుధవారం అవుకు పట్టణంలోని వాసవి కన్యకాపరమేశ్వరి ఆలయానికి చేరుకున్న ఎమ్మెల్యేకు ఆర్యవైశ్యులు ఘనంగా స్వాగతం పలికారు. అనంతరం ఆయన అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలను నిర్వహించారు. అనంతరం ఆయన ఆర్యవైశ్యుల ఆత్మీయ సమావేశంలో పాల్గొని మాట్లాడారు. తమ తండ్రి గారి కాలం నుంచి కూడా అవుకు పట్టణంలోని ఆర్యవైశ్యులకు తమ కుటుంబానికి మంచి సంబంధాలు ఉన్నాయని అన్నారు. ఆర్యవైశ్యుల్లో కూడా నిరుపేదలు ఉన్నారని, వారికి ప్రభుత్వం తరపున రావలసిన పథకాలు అన్ని అందిస్తామన్నారు. రాబోవు ఎన్నికల్లో ఆర్య వైశ్యులు తనను ఆదరించి గెలిపించాలని అభ్యర్థించారు. వైసిపి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత అర్హులైన వారికి ఇంటి స్థలం, భూమిలేని వారికి భూమి అందిస్తానని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు మేడం ఆంజనేయులు, సెక్రటరీ తల్లం నాగభూషణం, పులివెందుల సంఘం అధ్యక్షులు తాళ్లపల్లి నాగేంద్ర, పట్టణంలోని ఆర్యవైశ్యులు, పెద్దలు, వైసిపి మండలంకన్వీనర్ కాటసాని తిరుపాలరెడ్డి తదితరులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న ఎమ్మెల్యే కాటసాని రామిరెడ్డి

మహానందికి పోటెత్తిన కన్నడిగులు

ప్రజాశక్తి - మహానంది

మహానంది పుణ్యక్షేత్రం బుధవారం కన్నడ భక్తులతో కిక్కిరిసిపోయింది. ఉగాది పండగ సందర్భంగా కర్ణాటక, మహారాష్ట్ర రాష్ట్రాల నుంచి వేలాది మంది భక్తులు మహానంది క్షేత్రానికి తరలివచ్చారు. కన్నడ భక్తులు శ్రీశైలం మల్లన్న భ్రమరాంబ స్వామి అమ్మవార్ల దర్శనం చేసుకొని, తదనంతరం మహానందికి చేరుకున్నారు. కామేశ్వరి దేవి సహిత మహానందీశ్వర స్వామి వారిని దర్శించుకుని, అభిషేకం, కుంకుమార్చన తదితర పూజలు నిర్వహించుకున్నారు. సుదూర ప్రాంతాల నుండి వస్తున్న భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో కాపు చంద్రశేఖర్ రెడ్డి, అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టారు. కన్నడ భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకొని ఆలయానికి సమీపంలో ప్రత్యేక పార్కింగ్ ఏర్పాటు చేయించి విద్యుత్ దీపాలతో అలంకరించారు. భక్తులకు వాహనాలు నిలిపే స్థలంలో చల్లని తాగునీరు, ఆలయానికి వచ్చే దారి మధ్యలో దాతల సహకారంతో మజ్జిగ పంపిణీ తదితర సౌకర్యాలు కల్పించారు. క్షేత్రం ప్రవేశద్వారం నుండి ఎండ వేడిమి నుండి భక్తులకు రక్షణ కల్పించడానికి టెంట్లు, పెండల్స్ ఏర్పాటు చేశారు. దర్శనానికి చంటి పిల్లలు ఉన్న మహిళలు, వృద్దులు, వికలాంగులకు ప్రత్యేకంగా వెళ్లేందుకు అనుమతించారు. క్షేత్ర పరిసరాల్లో ఉచిత అన్నప్రసాద వితరణ ఏర్పాట్లను దాతలు నిర్వహించారు. కన్నడ భక్తుల కోసం ఆలయ అధికారులు ప్రత్యేక నంది వాహన సేవ కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. స్వామివారి దర్శనం అంతరం కన్నడ భక్తులు ఎక్కువ సంఖ్యలో కర్రలు, చాటలు కొనుగోలు చేసి సాంప్రదాయబద్ధంగా తమ ఇండ్లకు తీసుకువెళ్లారు. భక్తుల కోసం ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేసినట్టు తిమ్మాపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం ఎంపీహెచ్ఈవో హుస్సేన్ రెడ్డి తెలిపారు. ఆయన మాట్లాడుతూ భక్తులకు వైద్యాధికారి డాక్టర్ భగవాన్ దాస్, సిబ్బంది ఆధ్వర్యంలో అవసరం నిమిత్తం, ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, మందులు అందజేస్తున్నట్లు తెలిపారు. ఆలయ పరిసరాల్లో భక్తులకు ఎటువంటి అవాంఛనీయ సంఘటన జరగకుండా నంద్యాల రూరల్ సీఐ శివకుమార్ రెడ్డి ఆధ్వర్యంలో మహానంది ఎస్సై నాగేంద్ర ప్రసాద్ పర్యవేక్షణలో ప్రత్యేక పోలీసు నిఘా ఏర్పాట్లు చేసి, భక్తుల భద్రత కోసం సెంట్రల్ సెక్యూరిటీ ఫోర్సుతో కూడా పర్యవేక్షించారు.


కన్నడ భక్తులతో కిటకిటలాడుతున్న మహానంది క్షేత్రం

ఘనంగా సీతారామిరెడ్డి పుట్టినరోజు వేడుకలు

ప్రజాశక్తి - మంత్రాలయం

వైసిపి నాయకులు, టిటిడి పాలకమండలి సభ్యులు వై.సీతారామిరెడ్డి పుట్టినరోజు వేడుకలను బుధవారం ఘనంగా నిర్వహించారు. వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో వైసిపి నాయకులు, కార్యకర్తలు రాఘవేంద్ర సర్కిల్‌లో కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. ఈ సందర్భంగా భీమిరెడ్డి కేక్ కట్ చేయగా భీమయ్య, ఇతర నాయకులు కేకును ఆయనకు తినిపించారు.

సీతారామిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపిన నాయకులు

సీతారామిరెడ్డికి పలువురు వైసిపి నాయకులు పుట్టినరోజు శుభాకాంక్షలు తెలిపారు. ఎమ్మిగనూరు పట్టణంలోని భీమా నిలయంలో వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య, ఉప సర్పంచి హోటల్ పరమేష్ స్వామి, ఎంపిటిసి జి.వెంకటేష్, వార్డు సభ్యులు జగదీష్ స్వామి, భాస్కర్, వీరారెడ్డి, మంత్రాలయానికి చెందిన నాయి బ్రాహ్మణులు, బూదూరు నాయకులు జక్కయ్య, చెట్నిహల్లి సర్పంచి అంజినయ్య తన మద్దతుదారులతో కలిసి శాలువా, పూలమాలలు వేసి పుష్పగుచ్చం అందజేసి, కేక్ కట్ చేయించి సీతారామిరెడ్డికి శుభాకాంక్షలు తెలిపారు.


వేడుకలు నిర్వహిస్తున్న నాయకులు

సీతారామిరెడ్డి సమక్షంలో వైసిపిలో చేరిక

స్థానిక రాఘవేంద్ర నగర్ కాలనీకి చెందిన సుమారు 30 కుటుంబాలు వైసిపిలో చేరాయి. వైసిపి మండలాధ్యక్షులు భీమిరెడ్డి, సర్పంచి తెల్లబండ్ల భీమయ్య ఆధ్వర్యంలో ఎమ్మిగనూరు పట్టణంలోని భీమా నిలయంలో సీతారామిరెడ్డి సమక్షంలో వైసిపిలో చేరారు. శ్రీమఠంలో పనిచేసే పారిశుధ్య కార్మికులు మారెప్ప, అనిల్, లక్ష్మన్న వైసిపిలో చేరారు.


సమావేశంలో మాట్లాడుతున్న పంపన్న గౌడ్

టిడిపిలో చేరికలు అవాస్తవం

- సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్న గౌడ్

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

మండలంలోని కె.తిమ్మాపురం గ్రామం నుంచి 100 మంది సిపిఐ నాయకులు టిడిపిలో చేరినట్లు చెప్పడం అవాస్తవమని సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు పంపన్న గౌడ్, జి.రంగన్న, సిపిఐ మండల కార్యదర్శి బిటి.చిన్నన్న తెలిపారు. బుధవారం సిపిఐ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వారు మాట్లాడారు. కె.తిమ్మాపురం గ్రామం కమ్యూనిస్టు పార్టీ (సిపిఐ) కంచుకోటని తెలిపారు. అలాంటి గ్రామాన్ని విచ్ఛిన్నం చేసేందుకు బూటకపు చేరికలకు టిడిపి నాయకులు పాల్పడడం బాధాకరమని అన్నారు. ఒకప్పుడు సిపిఐనే మాజీ మంత్రి బీవీ.మోహన్ రెడ్డికి అండగా నిలిచి రాజకీయంగా ఎదుగుదలకు ఉపయోగపడిందని తెలిపారు. ఈ విషయాన్ని మాజీ ఎమ్మెల్యే బీవీ.జయ నాగేశ్వరరెడ్డి గుర్తు పెట్టుకోవాలని సూచించారు. ఆ గ్రామంలో గతం నుంచి టిడిపిలో కొనసాగిన వారికే టిడిపి కండువాలు వేశారని తెలిపారు. సిపిఐ నాయకులు ఎవరూ వెళ్లలేదన్నారు. అక్కడికి పోయిన వారికి సిపిఐ సభ్యత్వం లేనప్పుడు వారు సిపిఐ నాయకులు ఎలా అవుతారని ప్రశ్నించారు. సిపిఐ తిమ్మాపురం గ్రామ కార్యదర్శి బిపి.వెంకటేష్, మండల సహాయ కార్యదర్శి రాజీవ్, మండల నాయకులు తిమ్మ గురుడు, నాయకులు కెసి.జబ్బార్, దాదావలీ, సమీవుల్లా, ఖాజా పాల్గొన్నారు.


ప్రభను ఊరేగిస్తున్న ప్రజలు

ఘనంగా ఉగాది ఉత్సవాలు

ప్రజాశక్తి - గోనెగండ్ల

మండలంలోని వివిధ గ్రామాలతో పాటు గోనెగండ్లలో ఉగాది వేడుకలను ప్రజలు రెండు రోజులపాటు ఘనంగా నిర్వహించుకున్నారు. మంగళవారం ఉదయాన్నే వీరశైవ పీఠాధిపతి శివయ్య స్వామి పంచాంగ శ్రవణం చేసి, శ్రీక్రోదినామ సంవత్సరం సందర్భంగా ప్రజలందరికీ శుభాకాంక్షలు తెలియజేశారు. సాయంత్రం సంత మార్కెట్ ఆంజనేయ స్వామి దేవాలయం నుంచి బస్టాండ్ సమీపంలోని ప్రధాన రహదారి వరకు ప్రభను అందంగా అలంకరించి ప్రజలందరూ కలిసి లాగుతూ ఊరేగించారు. రెండో రోజు బుధవారం ఉదయం మండలంలోని అన్ని గ్రామాల్లో వసంత పంచమి సందర్భంగా ప్రజలందరూ రంగులు చల్లుకున్నారు. ప్రధాన రహదారి వద్ద నిర్వహించిన నందికోళ్ల ఆట ప్రజలను కనువిందు చేసింది. సంత మార్కెట్ నుంచి పాదశివాలయం వరకు ప్రభను ఊరేగించడంతో ఉత్సవాలు ముగిశాయి. గ్రామ పెద్దలు, ప్రజలు పాల్గొన్నారు.

జెబిపి అభ్యర్థిగా షేక్ షా వలీ

ప్రజాశక్తి- ఆలూరు



ఆలూరు నియోజకవర్గం జై భారత్ పార్టీ అభ్యర్థిగా షేక్ షా వలీని మొదటి జాబితాలో అధిష్టానం బుధవారం ఖరారు చేసింది. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ నియోజకవర్గాలకు గాను కర్నూలు రెండు, నంద్యాల మూడు స్థానాలు, రెండు పార్లమెంట్ స్థానాలకు గాను కర్నూలు ప్రకటించింది. ఆలూరు అభ్యర్థి ప్రొఫెసర్ షేక్ షా వలీ ఇప్పటికే నియోజకవర్గంలో పర్యటిస్తూ ప్రజా సమస్యలను తెలుసుకుంటూ ప్రచారం కొనసాగిస్తున్నారు.

ఎన్నికల విధులపై పిఒ, ఎపిఒలకు శిక్షణ

ప్రజాశక్తి-ఆలూరు

ఎన్నికల విధుల్లో భాగంగా నిర్వహించాల్సిన బాధ్యతలపై ఆర్ఒ, ఎఆర్ఒ ఆధ్వర్యంలో పిఒ, ఎపిఒలకు బుధవారం ఆర్‌డిటి ఆడిటోరియంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్ఒ రాము నాయక్ మాట్లాడారు. నియోజకవర్గం (147)లో 294 పోలింగ్ కేంద్రాలకు సంబంధించిన 741 మంది పిఒలు, 1010 మంది ఎపిఒలకు గాను 749 మందికి ఎన్నికల నిర్వహణపై శిక్షణ నిర్వహించినట్లు తెలిపారు. గత ఎన్నికల్లో ఈవిఎమ్‌లు సరిగ్గా కనెక్ట్ చేయనందున ఇబ్బందులు పడిన సందర్భాలు ఉన్నాయని చెప్పారు. అలాంటి పరిస్థితి రాకూడదనే పిఒ, ఎపిఒలకు శిక్షణ ఇచ్చినట్లు తెలిపారు. గ్రీన్ పేపర్ సీల్, పింక్ పేపర్ సీల్, అడ్రస్ ట్యాగ్స్, స్పెషల్ ట్యాగ్స్ లాంటివి ఎలా ఉంటాయనే విషయంపై అవగాహన కల్పించారు.


మాట్లాడుతున్న ఆర్ఒ రాము నాయక్

13 వరకు పోస్టల్ బ్యాలెట్

ఎన్నికల అధికారులు, హెల్త్, పోలీసులు, ఆర్‌టిసి, డిటిసి ఉద్యోగులందరూ ఈనెల 13 సాయంత్రం 5 గంటల్లోపు తహశీల్దార్ కార్యాలయంలో పోస్టల్ బ్యాలెట్ ఇవ్వాలని ఎఆర్ఒ వి.చంద్రశేఖర్ తెలిపారు. పోస్టల్ బ్యాలెట్ కోసం దరఖాస్తు ఫారం, ఆధార్, ఐపి కార్డు, రెండు ఫొటో లు ఉండాలన్నారు. బి.నాగరాజు, ఎన్.నాగరాజు, కళాప్ప, రామకృష్ణా రెడ్డి, డిటి రజనీకాంత్ రెడ్డి, ఎడిటి గుండల్ నాయక్ పాల్గొన్నారు.

ఘనంగా వసంతోత్సవం

ప్రజాశక్తి- ఆలూరు

మండలంలోని గ్రామాల్లో, పట్టణంలో ఉగాది మరుసటి రోజు బుధవారం చిన్నారులు, పెద్దలు, మహిళలు ఒకరికొకరు రంగులు పూసుకుంటూ వసంతోత్సవం జరుపుకున్నారు. పట్టణంలో చిన్నారులు, పెద్దలు రంగులు పూసుకొని కేరింతలతో పురవీధుల గుండా తిరిగారు.


రంగులు చల్లుకుంటున్న చిన్నారులు, పెద్దలు

అంబేద్కర్ జయంతిని జయప్రదం చేద్దాం

- జయంత్యుత్సవ కమిటీ కన్వీనర్ దేవ సహాయం, సభ్యులు ఆనంద్ చైతన్య మాదిగ

ప్రజాశక్తి - ఎమ్మిగనూరు

ఈనెల 14న పట్టణంలోని పద్మశ్రీ మాచాని సోమప్ప మెమోరియల్ హాలులో నిర్వహించే డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంత్యుత్సవ సభను జయప్రదం చేయాలని డాక్టర్ బిఆర్.అంబేద్కర్ జయంత్యుత్సవ కమిటీ కన్వీనర్ ఎస్.దేవ సహాయం, సభ్యులు జి.ఆనంద్ చైతన్య మాదిగ కోరారు. బుధవారం మండలంలోని దేవబెట్ట, కందనాతి, కడివెల్ల, ఎస్.నాగలాపురం, కోటేకల్, మల్కాపురం, బనవాసి గ్రామాల్లోని దళితవాడల్లో కరపత్రాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. ఉత్సవ కమిటీ ఛైర్మన్ మాల ఉసేని అధ్యక్షతన జరిగే ఈ సభ ముందుగా కలుగొట్ల రోడ్డులోని ఎంబి చర్చి నుంచి సభ స్థలం వరకు భారీ ప్రదర్శన ఉంటుందని తెలిపారు. పెద్ద ఎత్తున తరలివచ్చి దళితుల ఐక్యతను ప్రదర్శించాలని కోరారు. కెవిపిఎస్ జిల్లా సహాయ కార్యదర్శి కనకవీడు రాజు, కనకవీడు పూజారి, మాల నాగప్ప ఉన్నారు.


ప్రచారం నిర్వహిస్తున్న నాయకులు

బండలాగుడు పోటీలు


పోటీలను ప్రారంభిస్తున్న వెంకటేశ్వర రెడ్డి

ప్రజాశక్తి - నందవరం

ఉగాది సందర్భంగా టి.సోమలగూడూరులో వైఎస్ఆర్ ఎద్దుల బండ లాగుడు పోటీలను వైసిపి సీనియర్ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించారు. బండలాగుడు పోటీల్లో బోయ నాగరాజు ఎద్దులు మొదటి బహుమతి రూ.20 వేలు, బోయ ఈరన్న ఎద్దులు రెండో బహుమతి రూ.15 వేలు, బోయ రామాంజిని ఎద్దులు మూడో బహుమతి రూ.10 వేల చొప్పున గెలిచాయి. మూడు బహుమతులను టి.సోమలగూడూరుకు చెందిన ఎద్దులే గెలుచుకున్నాయి. బుధవారం వారు మాట్లాడారు. మాజీ ముఖ్యమంత్రి కీర్తిశేషులు వైఎస్.రాజశేఖర్ రెడ్డి రైతు సంక్షేమానికి పెద్దపీట వేశారని తెలిపారు. ఆయన కుమారుడు, ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి రైతుల పక్షపాతిగా ఉంటూ రైతు సంక్షేమానికి ఎన్నో పథకాలను ప్రవేశపెట్టారని చెప్పారు. వైసిపి నాయకులు బాలముని, భీమన్న, రామాంజిని, ఎర్రన్న, సోమన్న, పాండు, వెంకటేష్ పాల్గొన్నారు.

మత సామరస్యానికి ప్రతీక

- టిడిపి ఇన్‌ఛార్జీ తిక్కారెడ్డి

ప్రజాశక్తి - కోసిగి

ఇఫ్తార్ విందు ఆత్మీయతకు, మత సామరస్యానికి ప్రతీక అని టిడిపి ఇన్‌ఛార్జీ పాలకుర్తి తిక్కారెడ్డి తెలిపారు. బుధవారం కోసిగిలోని జమీనియా మసీదులో ముస్లింలకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. నాయకులు సుధీర్ రెడ్డి, వక్రాణి వెంకటేశు లు, భరద్వాజ శెట్టి, రవితేజ శెట్టి, నాడిగేని అయ్యన్న, నాడిగేని రంగన్న, ఉమర్ సాబ్, మహాదేవ, కృష్ణారెడ్డి, చిన్నబోంపల్లి నరసింహులు, వీరారెడ్డి పాల్గొన్నారు.


ఇఫ్తార్ విందులో పాల్గొన్న తిక్కారెడ్డి

దళితవాడలో దాహం.. దాహం...

- పట్టించుకోని అధికారులు

ప్రజాశక్తి - కౌతాళం

ఎండలు మండుతున్నాయి..! పేదల గొంతు 'దాహం.. దాహం...' అంటూ కేకలు వేస్తున్నాయి. బిందెడు నీటి కోసం మహిళలు రాత్రనక, పగలనక వ్యవసాయ బోర్ల చుట్టూ పరుగులు తీస్తున్నారు. గ్రామంలోని దళితవాడలో నీటి సమస్య పరిష్కరించాలని మండల అధికారులకు విన్నవించినా కూడా పట్టించుకునే నాథుడే కరువయ్యారు. మండలంలోని తుంగభద్ర నదికి దగ్గరలో ఉన్న గ్రామాల్లో ఒకటైన కాత్రికి దళితవాడలో ప్రజలు నీటి సమస్యను ఎదుర్కొంటున్నారు. గ్రామంలో దళితులు నివాసం ఉన్న చోట నీటి సరఫరా జరగడం లేదు. మిగతా ప్రాంతంలో నీటి సరఫరా అవుతున్నా, దళితులకు మాత్రం నీరు అందడం లేదు. ఈ విషయంపై సంబంధిత అధికారుల దృష్టికి ఎన్నిసార్లు తీసుకెళ్లినా పరిష్కారం కావడం లేదని ఆ కాలనీవాసులు పేర్కొంటున్నారు. నీటి సమస్యపై గ్రామానికి చెందిన ప్రకాష్, బుగ్గన గౌడ్, షేక్షావలీ, మంగయ్య, అబ్రహాం, సాల్మన్‌లు ఎంపిడిఒ రఘునాథ్ గుప్తాకు మంగళవారం వినతిపత్రం అందజేశారు.


కాత్రికిలో ఇబ్బంది పడుతున్న ప్రజలు

25 లోగా పోలింగే కేంద్రాల మరమ్మతు పనులు పూర్తి

13 వరకు పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు గడువు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పోస్టల్ బ్యాలెట్ దరఖాస్తు చేసుకొనుటకు ఈనెల 13 చివరి తేది అని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన పేర్కొన్నారు. బుధవారం తెలికాన్ఫరెన్స్ ద్వారా పలు అంశాలపై జిల్లా కలెక్టర్ సమీక్షించారు. నియోజకవర్గ హెడ్ క్వార్టర్ తహశీల్దార్ కార్యాలయాల్లో, కర్నూలు, ఆదోని ఎమ్మిగనూరు నగరపాలక సంస్థ కార్యాలయాల్లో పోస్టల్ బ్యాలెట్ కౌంటర్‌ను ఏర్పాటు చేయించాలని సంబంధిత కౌంటర్లలో తహశీల్దార్ కార్యాలయంలో అయితే తహశీల్దార్ కార్యాలయానికి సంబంధించిన సిబ్బంది, డిఆర్‌డిఎ సిబ్బంది ఉండి దరఖాస్తులను తీసుకోవాలని వచ్చిన దరఖాస్తుల డేటాను వెంటనే ఎంట్రీ చేయాలన్నారు. ఆ విధంగా చేయడంతో డూప్లికేషన్ ఎంట్రీ ఉండదని డిఆర్‌డిఎ పిడిని కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో ఉండే 8 నియోజకవర్గాలకు సంబంధించి పోస్టల్ బ్యాలెట్ కొరకు వచ్చిన దరఖాస్తులైతే ఇక్కడే డిస్ట్రిబ్యూట్ అవుతాయన్నారు. అలా కాకుండా ఇతర జిల్లా, రాష్ట్రాలకు సంబంధించిన దరఖాస్తులు పోస్టల్ బ్యాలెట్ కౌంటర్లలో వచ్చినట్లయితే డిఆర్‌డిఎ పిడికి పంపించాలని, తద్వారావాటిని ఇతర జిల్లాలు లేదా రాష్ట్రాలకు తదనుగుణంగా పంపుతామన్నారు.

264 మంది వాలంటీర్ల రాజీనామా

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

జిల్లాలో 11 మండలాల్లో ఆయా గ్రామ పంచాయతీ పరిధిలో పనిచేస్తున్న 254 మంది వాలంటీర్ల రాజీనామా చేసినట్లు జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సజన ఒక ప్రకటనలో బుధవారం వెల్లడించారు. సంబంధిత ఎంపిడిఒలు ఇచ్చిన సమాచారం మేరకు వాలంటీర్ల రాజీనామాను కూడా ఆమోదిస్తున్నట్లు తెలిపారు. వారికి సంబంధించిన సెల్ ఫోన్లు , సిమ్ కార్డులను సంబంధిత ఎంపిడిఒలకు అందజేయాలన్నారు.

డిగ్రీ సెమిస్టర్ ఫలితాలు విడుదల

ప్రజాశక్తి -కర్నూలు కలెక్టరేట్

రాయలసీమ యూనివర్సిటీ పరిధిలోని 2023 విద్యా సంవత్సరానికి సంబంధించిన డిగ్రీ మొదటి సెమిస్టర్ ఫలితాలను వైస్‌ఛాన్సర్ సుధీర్ ప్రేమ్ కుమార్ బుధవారం విడుదల చేశారు. రెగ్యులర్ కింద సెమిస్టర్ పరీక్షలు రాసిన విద్యార్థుల్లో 6999 మందికి గాను 3806 మంది ఉత్తీర్ణులు అయ్యారు. సప్లమెంటరీ కింద పరీక్షలు రాసిన విద్యార్థుల్లో 8525 మందికి గాను 3770 మంది విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారు.

ముస్లింలకు రంజాన్ శుభాకాంక్షలు

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్ : కర్నూలు జిల్లా ముస్లిం సోదర సోదరీమణులకు, కాంగ్రెస్ నాయకులకు కార్యకర్తలకు అభిమానులకు జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షులు కె.బాబురావు బుధవారం ఒక ప్రకటన ద్వారా రంజాన్ శుభాకాంక్షలు తెలిపారు. ముస్లింలకు రంజాన్ పండుగ అతి పవిత్రమైన పండుగ అని అన్నారు. ఈ పండుగలను ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని సూచించారు.



ఓటు హక్కు వినయోగంపై ప్రతిజ్ఞ చేయిస్తున్న అధికారులు

ఓటు హక్కుపై అవగాహన

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

జిల్లా ఎన్నికల అధికారి జిల్లా కలెక్టర్ డాక్టర్ జి సజన , 137 కర్నూలు అసెంబ్లీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి ఎ. భార్గవ్ తేజ ఆదేశాల మేరకు బుధవారం ఉదయం కార్యక్రమంలో భాగంగా, నగరంలోని ఉస్మానియా కాలేజీ దగ్గర నుండి ఓటరు అవగాహన ర్యాలీ నిర్వహించారు. ప్రజలను ఓటు హక్కు వినియోగం పట్ల జాగృతపరుస్తూ ఈ ర్యాలీ గఫార్ స్ట్రీట్ ఐడియల్ స్కూల్ మీదుగా, రంగరాజవీధి, వన్ టౌన్ సర్కిల్, జొహరాపురం రోడ్, బెకారీ కట్ట, మోతియా స్కూల్, రాములవారి గుడి, దండిగేరి మైదానం, బుధవారపేట బ్రిడ్జి వరకు సాగింది. ఈ ర్యాలీలో సోషల్ డెవలప్‌మెంట్ స్పెషలిస్ట్ డాక్టర్. పెంచలయ్య ,సంబంధిత బిఎల్‌ఒలు, సిఒ, ఆర్‌పి లు తదితరులు పాల్గొన్నారు.

కర్నూలు కలెక్టర్ డాక్టర్ సృజన

ప్రజాశక్తి-కర్నూలు కలెక్టరేట్

పోలింగ్ కేంద్రాల్లో చేపడుతున్న మరమ్మతుల పనులు ఈనెల 25వ తేదీ లోగా పూర్తి చేయాలని జిల్లా ఎన్నికల అధికారి , కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాలులో నోడల్ అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ముందుగా పోలింగ్ కేంద్రాలకు కల్పించాల్సిన మౌలిక సదుపాయాలను పూర్తి స్థాయిలో ఏర్పాటు చేశారా అని ప్రశ్నించారు. ఏప్రిల్ 25న ఎన్నికల పరిశీలకులు జిల్లాకు రానున్నారని, అంతలోపు ప్రతి పోలింగ్ కేంద్రంలో రెండు లైట్లు, ఫ్యాన్స్, ముఖ్యంగా టాయిలెట్ విత్ రన్నింగ్ వాటర్ ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. పోలింగ్ కేంద్రాలకు వచ్చే ఓటర్ల కోసం షేడ్స్, తాగు నీరు, కుర్చీలు, బ్యారికేడింగ్ ఏర్పాటుకు సంబంధించిన ప్రతిపాదనలు ఇవ్వాలని ఆదేశించారు. 1500 సమస్యాత్మక పోలింగ్ కేంద్రాల్లో వెబ్ క్యామ్ ఏర్పాటుకు సంబంధించి బయట, లోపల ప్లగ్ పాయింట్స్ ఏర్పాటు చేయాలన్నారు. సమావేశంలో డిఆర్‌ఒ మధుసూదన్ రావు, డిప్యూటీ కలెక్టర్ నాగలక్ష్మి ప్రసన్న, పంచాయతీ రాజ్ ఎస్‌ఇ సుబ్రమణ్యం, ఆర్డబ్ల్యూఎస్ ఎస్‌ఇ నాగేశ్వరరావు, ఒడబ్ల్యుఐడిసి లక్ష్మి నారాయణ, కర్నూలు మున్సిపల్ సిబ్బంది, ఎమ్మిగనూరు మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి, గూడూరు మున్సిపల్ కమిషనర్ తదితరులు పాల్గొన్నారు.

గ్రామాల్లో ఉపాధి పనులు ప్రారంభం కావాలి

జిల్లాలో వచ్చే సోమవారం నుండి అన్ని గ్రామాల్లో 100శాతం ఉపాధి పనులు ప్రారంభం కావాలని జిల్లా కలెక్టర్ డాక్టర్ జి.సృజన సంబంధిత అధికారులను ఆదేశించారు. బుధవారం కలెక్టర్ క్యాంపు కార్యాలయం నుండి ఉపాధి హామీ పనులపై మండల స్థాయి సిబ్బందితో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జిల్లా కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ప్రతి మండలంలో రోజుకు ఐదు వేల మందికి తగ్గకుండా పనులు కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఉపాధి హామీ సగటు వేతనము రూ.300 వరకు ఉండగా మన జిల్లాలో 281 వరకు సాధించగలిగామన్నారు. హొళగుంద మండలంలో 232 వరకు మాత్రమే సాధించారని కలెక్టర్ అసంతృప్తి వ్యక్తం చేశారు. పత్తికొండ మండలం కూడా ఇందులో వెనుకబడి ఉందన్నారు.. ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు పనులు కల్పించడంలో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. ఎమ్మిగనూరు, పెద్దకడుబూరు, కృష్ణగిరి, దేవనకొండ, వెల్దుర్తి మండలాల్లో ఎస్సీ, ఎస్టీలకు చాలా తక్కువ శాతం వారికి పనులు కల్పించారని, పనులు జరిగే చోట ఒఆర్‌ఎస్, అవసమైతే మెడికల్ క్యాంపులు ఏర్పాటు చేయాలన్నారు. షేడ్స్, తాగు నీరు ఏర్పాటు చర్యలు తీసుకోవాలని ఎంపిడిఒలను కలెక్టర్ ఆదేశించారు. వీడియో కాన్ఫరెన్స్‌లో డ్వామా పిడి అమర్నాథ్ రెడ్డి, ఎంపిడిఓలు తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ డాక్టర్ సృజన

చలివేంద్రాల ఏర్పాటుకు అనుమతి : జిల్లా కలెక్టర్

ప్రస్తుతం వేసవి ఉష్ణోగ్రతలు పెరుగుతున్న నేపథ్యంలో జిల్లాలో చలివేంద్రాలను రాజకీయ నాయకుల ప్రమేయం లేకుండా స్వచ్ఛంద సంస్థలు ఏర్పాటు చేస్తే అనుమతించాలని జిల్లా కలెక్టర్ జి. సృజన పేర్కొన్నారు. బుధవారం కలెక్టరేట్ లో నుండి మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ వేసవి కాలంలో వీచే వడగాలులపై ప్రజలు జాగ్రత్తగా ఉండేలా వారికి అవగాహన కల్పించాలని వైద్య ఆరోగ్య శాఖ అధికారులను ఆదేశించారు.. ఒఆర్‌ఎస్ పాకెట్స్ అందుబాటులో ఉంచుకోవాలని ఆదేశించారు. ఏప్రిల్ లోనే 46, 47 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదవుతోంది..వచ్చే నెలల్లో 50 డిగ్రీలకు చేరే అవకాశం ఉన్నందున ప్రజలు మ.12గం.ల నుండి మ.4 గం.ల వరకు అత్యవసర పనులు ఉంటే తప్ప బయటికి రాకుండా ఇళ్లలోనే ఉండేలా చూడాలన్నారు. వేసవిలో తాగు నీటి సరఫరా ముఖ్యమని, ఎక్కడైనా తాగునీటి సమస్య ఏర్పడితే వెంటనే తన దృష్టికి తీసుకురావాలని కలెక్టర్ ఆదేశించారు.. నీటి సరఫరా చేయలేని పరిస్థితుల్లో నీటిని రవాణా చేసేందుకు వెంటనే చర్యలు తీసుకుంటామని కలెక్టర్ పేర్కొన్నారు. అనుమతులు లేవని, తాగునీటి సరఫరాలో జాప్యం చేయవద్దని కలెక్టర్ సూచించారు. ఉపాధి హామీ పనులకు వచ్చే వారిని ఉ.10 గంటల లోపు పనులు ముగించుకొని ఏదైనా పని మిగిలి ఉంటే సాయంత్రం సదరు పనులు పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఈ సమావేశంలో పలువురు జిల్లా ఉన్నతాధికారులు పాల్గొన్నారు.



చెక్ పోస్ట్‌ను తనిఖీ చేస్తున్న నంద్యాల ఎస్‌పి రఘువీర్‌రెడ్డి

అప్రమత్తంగా ఉండాలి : ఎస్‌పి

లింగాలగట్టు అంతర్‌రాష్ట్ర చెక్ పోస్ట్ తనిఖీ

ప్రజాశక్తి - శ్రీశైలం ప్రాజెక్ట్

నంద్యాల జిల్లా ఎస్‌పి కె.రఘువీర్ రెడ్డి తెలంగాణ నుండి శ్రీశైలంలోకి ప్రవేశించు మార్గంలో లింగాల గట్టులో ఏర్పాటు చేసిన అంతర్ రాష్ట్రచెక్ పోస్ట్‌ను బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం సిబ్బందికి సూచనలు చేస్తూ ఎల్లప్పుడూ అప్రమత్తంగా ఉండాలన్నారు. రాబోయే ఎన్నికలను దృష్టిలో ఉంచుకొని నగదు, బంగారం, వెండి విలువైన వస్తువులు ,మద్యం అక్రమ రవాణా జరగకుండా ప్రతి వాహనాన్ని క్షుణ్ణంగా తనిఖీ చేయాలన్నారు. ఏదైనా సంఘటన జరిగినప్పుడు వెంటనే సంబంధిత అధికారులకు సమాచారం అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఎస్‌పితో పాటు ఆత్మకూరు డిఎస్‌పి ఎ.శ్రీనివాసరావు , శ్రీశైలం టౌన్ ఇన్‌స్పెక్టర్ జి. ప్రసాదరావు , పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

మత సామరస్యాన్ని చాటుకున్న డాక్టర్ వలి

కసాపురం దేవాలయంలో ఉచిత వైద్య శిబిరం

ప్రజాశక్తి- మద్దికేర

హిందువుల జాతరలో ఉచిత వైద్య శిబిరాన్ని నిర్వహించి డాక్టర్ వలి మతసామ రస్యాన్ని చాటుకున్నారు. మద్దికేర గ్రామానికి చెందిన డాక్టర్ వలి ఆర్‌ఎంపీగా 30 ఏళ్ల నుంచి వైద్య సేవలు చేస్తున్నారు. తాను ఆర్‌ఎంపీగా పని చేస్తున్నప్పటి నుంచి కసాపురం ఆంజనేయ స్వామి దేవాలయంలో ఉగాది పండుగ రోజున జరిగే రథోత్సవం సందర్భంగా నాలుగు రోజులపాటు ఉచిత వైద్య శిబిరం నిర్వహించి భక్తులకు ఉచితంగా సేవలు అందిస్తున్నారు. కసాపురం దేవాలయానికి ఉగాది పండుగ పురస్కరించుకొని కర్నూలు, అనంతపురం, జిల్లాల నుంచి వేలాది మంది వచ్చి దర్శించుకుంటారు. ఈ సందర్భంగా భక్తులు అనారోగ్యానికి గురైతే అక్కడ ఏర్పాటు చేసిన ఉచిత వైద్య శిబిరంలో చికిత్స పొందుతున్నారు. ఈ విషయంపై డాక్టర్ వల్లి మాట్లాడుతూ ఏ మతమైనా అందరూ ఒకటేనని మతాల కతీతంగా జీవనం సాగించాలన్నారు. తాము ప్రతి ఏడాది కసాపురం దేవాలయంలో ఉగాది పండుగ రోజుల్లో ఉచిత వైద్య శిబిరం నిర్వహిస్తున్నా మన్నారు. ఆర్‌ఎంపీ డాక్టర్ రామ్మోహన్ వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

సిపిఎం అభ్యర్థి గౌస్‌దేశాయ్ గెలుపునకు కృషి

ప్రజాశక్తి-కర్నూలు కార్పొరేషన్

ప్రజా సమస్యల పరిష్కారం కోసం పోరాడే, సిపిఎం అభ్యర్థి గౌస్ దేశాయ్‌కు ,మీ అమూల్యమైన, ఓటు వేసి, వేయించి గెలిపించాలని ,సిపిఎంనగర కార్యదర్శి వర్గ సభ్యులు, షేక్ మొహమ్మద్ షరీఫ్, సిపిఎం సీనియర్ నాయకులు, కె. రాజగోపాల్ ,పార్టీ నగర కమిటీ సభ్యులు ఎస్. డి. ఖాజా పాషా, మహబూబ్ బాషా లు ప్రజలను కోరారు.కేంద్ర ,రాష్ట్ర ప్రభుత్వాలు, ప్రజల పైన ఎటువంటి భారాలు వేసినా మరుక్షణం స్పందించి, ధరలు తగ్గేదాకా కలెక్టరేట్, తహశీల్దార్, మున్సిపల్ కార్యాలయాలముందు పెద్ద ఎత్తున ఆందోళన, పోరాటాలు చేసి ప్రజల పక్షాన నిలబడేది సిపిఎం అని వారు కొనియాడారు. అటువంటి నైతిక విలువలు కలిగిన ప్రజా శ్రేయస్సు కోరి పోరాడే ,సిపిఎం అభ్యర్థి డి. గౌస్ దేశాయ్ సుత్తి, కొడవలి నక్షత్రం గుర్తుపై మీ అమూల్యమైన, పవిత్రమైన, ఓటు వేసి, వేయించి ,భారీ మెజారిటీతో గెలిపించాలని కోరారు.మతోన్మాద బిజెపి ,మన ఆంధ్ర రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిందని ,ప్రత్యేక హోదా,విభజన హామీలు, రాయలసీమ ప్యాకేజీ, కడప ఉక్కు ఫ్యాక్టరీలకు నిధులు కేటాయించలేదని, హామీలను విస్మరించిందని విమర్శించారు. ఆంధ్ర ప్రజల ఆత్మగౌరవాన్ని, తుంగలో తొక్కిన ,బిజెపి పార్టీకి దానికి మద్దతు తెలిపే వైసిపి ,టిడిపిలను ఓడించాలన్నారు. కేంద్రంలోని బిజెపి, రాష్ట్రంలోని వైసిపి, ప్రజా వ్యతిరేక విధానాలు అవలంబిస్తున్నాయని, ప్రజల పైన నిత్యవసర వస్తువుల ధరలతో పాటు, పెట్రోల్ ,డీజిల్, వంట గ్యాస్ ధరలు పెంచి పేద మధ్యతరగతి ప్రజల నడ్డి విరుస్తున్నాయన్నారు. బిజెపి ,వైసిపి ,టిడిపిలకు భరతం పట్టి నిరంతరం అందుబాటులో ఉండే ,ప్రజల సమస్యల పరిష్కారం కోసం పోరాడే డి.గౌస్ దేశాయ్‌ని గెలిపించాలని ప్రజలను కోరారు.ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు రాంబాబు , మద్దిలేటి , శాలి ,హాజీబాష, నూర్ భాషా ,బాబులి ,బాబు, గౌస్ బాష, షేక్షావలి, జావీద్, అర్షాద్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న సిపిఎం నాయకులు రాజగోపాల్